తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
31 మే, 2026





# యమునా తీరాన ..
# పుష్కర తీర్థాన !

# రామ్ జోడీగా శ్రీనిధిశెట్టి!



యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చాడు. తన కొత్త చిత్రానికి ఆయనే స్వయంగా దర్శకత్వం వహించబోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే కూడా రామ్ స్వయంగా అందించడం విశేషం.

సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా 'కేజీయఫ్' ఫేమ్, కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టిని ఎంపిక చేసేందుకు చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆమె వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తోంది. నాని సరసన 'హిట్3' సినిమాలో నటించిన శ్రీనిధి మంచి సక్సెస్ అందుకుంది.

రామ్ సరసన శ్రీనిధి నటిస్తే ఈ సినిమాకు మరింత క్రేజ్ రావడం ఖాయమని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని కృష్ణ పోతినేని ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2026 డిసెంబర్ నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

తారాతీరం

# బాలకృష్ణ సినిమాలో మంచు మనోజ్





నందమూరి బాలకృష్ణ కథానాయకుడుగా ఇప్పుడు తన కెరీర్ 111వ చిత్రాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో చేస్తున్న సంగతి తెలిసిందే. బాలయ్య నుంచి సాలిడ్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగు జరుపుకుంటోంది. ఇక ఈ చిత్రంలో మంచు వారి కథానాయకుడు రాకింగ్ స్టార్ మంచు మనోజ్ నటిస్తున్నట్లు తాజా సమాచారం. దీనితో ఈ ప్రాజెక్ట్‌లో మనోజ్ ఎలాంటి పాత్రలో కనిపిస్తాడని.. అందరిలో మరింత ఆసక్తి ఏర్పడింది. అయితే గతంలో మంచు మనోజ్ సినిమా 'ఊ కొడతారా? ఉలిక్కి పడతారా?' అనే సినిమాలో బాలయ్య అతిథి పాత్రలో కనిపించారు. కామెడీ హారర్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రంలో బాలయ్య రోల్ మంచి ఇంపాక్ట్ చూపించింది.

ఇక.. మళ్ళీ ఇన్నాళ్ళకి బాలయ్య సినిమాలో మనోజ్ నటించనున్నాడు. సో.. ఈసారి తన పాత్ర ఎలా ఉంటుందో చూడాల్సిందే మరి! ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు.

ఆదివారం వార్త

31 మే, 2026

## మంచి ముత్యాలు

- మనం జీవిస్తాం, నేర్చుకుంటాం కానీ విజ్ఞులుగా ఎదగలేం.
- చేతనైతే ఇతరుల కంటే ఎక్కువ మేధావిగా వుండు. కానీ ఆ సంగతి ఎవ్వరికీ చెప్పకు. - చెస్టర్ ఫీల్డ్

## కదంబం

'సంఘీ'భావం....5
అవినీతి నిరోధానికి అంతమెప్పుడు?

కవర్ స్టోరీ..6
యమునా తీరాన..
పుష్కర తీర్థాన!

ఈ వారం కవిత్వం.. 11
మనసంటే..

ఎవి వెలుగుల్లో చిన్నారుల..19

కథ..20
విష్ణుమాయ

ఇంకా...
మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## ఆ ఊరినిండా పాములే!

అల్లంత దూరంలో ఒక చిన్న పాముపిల్లను చూస్తేనే అమ్మో! అని భయపడి దూరంగా పారిపోతాం. అలాంటిది ఆ ఊరినిండా పాములున్నా అందరూ నిర్భయంగా తిరుగుతున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇంతకూ అసలు సంగతేమిటంటే– మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఉన్న షేట్‌ఫల్ గ్రామంలో పాములు ఇష్టారాజ్యంగా తిరుగుతుంటాయి. ఈ గ్రామం పూణె నుంచి సుమారు రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.



ఈ ఊరిలో మరో వింత ఏమిటంటే– ప్రతి ఇంట్లో దేవస్థానం పేరుతో పాములు విశ్రాంతి తీసుకోవడానికి ఒక ప్రత్యేకమైన స్థలాన్ని నిర్మిస్తారు. పాములు కేవలం బయట తిరగడమే కాకుండా, స్వేచ్ఛగా ఇళ్లలోకి, బడుల్లోకి, గుడిలోకి వస్తూ పోతూ ఉంటాయి. వీటిని ఎవరూ బంధించరు. అలాగని పెంపుడు జంతువుల్లా చూడరు. కేవలం వాటిని దైవస్వరూపాలుగా భావించి గౌరవిస్తారు.

ఎన్నో ఏళ్లుగా ఈ విషసర్పాలతో గ్రామస్థులు కలిసి ఉంటున్నా, అక్కడ పాముకాటు వల్ల ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు లేవని గ్రామస్థులు చెప్తుంటారు. మనుషులు, పాముల మధ్య ఉన్న పరస్పర గౌరవమే దీనికి కారణమని వారు నమ్ముతారు. ఇక్కడ పిల్లలు నాగుపాములతో ఆడుకోవడం అక్కడికి వచ్చే పర్యాటకులకు ఒక అద్భుతంలా అనిపిస్తుంది. ఈ గ్రామంలో నాగుపాములతో పాటు జెర్రిపోతులు, కట్లపాములు, పచ్చపాములు, నీటి పాములు మొదలైనవి కూడా కనిపిస్తాయి. షేట్‌ఫల్ గ్రామం సోలాపూర్ రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ఉంటుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# పెళ్లికట్నంగా వెయ్యి పుస్తకాలు

పశ్చిమ బెంగాల్‌లో ఆ మధ్య ఓ విచిత్రమైన పెళ్ళి జరిగింది.

కట్నం అక్కర్లేదన్న వరుడికి పెళ్ళికూతురింటి వాళ్ళు అతనికి కావలసిన పుస్తకాలు కొనిచ్చి ఆశ్చర్యపరచిన ఉదంతమిది. వరుడు ఓ టీచర్.

కట్నకానుకల కోసం సిలిండర్ పేలడం, నిప్పంటించడం ఆత్మహత్య చేసుకునేలా చేయడం వంటి సంఘటనలు తెలియనివేమీ కాదు.

కట్నం ఒకవైపు తీసుకుంటూనే "తామేమీ కట్నం తీసుకోలేదని, అత్తింటి వాళ్ళే ఇష్టపడి ఇచ్చారని" చెప్పేవాళ్ళు మనకు తెలుసు. "మీరే ఏదైనా మీ అమ్మాయికి ఏదో ఒకటి చేయండి.." అని లౌక్యాన్ని ప్రదర్శించిన వాళ్ళున్నారు.

ఈ స్థితిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సోనార్‌పూర్‌కి చెందిన ఓ స్కూలు టీచర్ సూర్యకాంత బారిక్, ప్రియాంకా బేజ్ అనే అమ్మాయికి పెళ్ళి ఖాయం చేశారు.

ప్రియాంకా బేజ్ స్వస్థలం తూర్పు మిద్నపూర్. అయితే ప్రారంభంలోనే అబ్బాయి ఇంటి వాళ్ళు తమకు కట్నం వద్దని కచ్చితంగా చెప్పారు ముప్ఫై ఏళ్ళ సూర్యకాంత.

ఈ స్థితిలో పెళ్ళి రోజున సూర్యకాంతకు కట్నానికి బదులు వేయి పుస్తకాలు ఇచ్చి ఆశ్చర్యపరిచారు అత్తింటి వాళ్ళు. ఆ వెయ్యి పుస్తకాల విలువ లక్ష రూపాయలు. తన భర్త ఇంటి వారికి కట్నం తీసుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదని, భర్త గుణానికి ముగ్ధురాలైన ప్రియాంకా తన భర్తకు నచ్చిన వెయ్యి పుస్తకాలను కానుకగా ఇచ్చారు. ఈ పుస్తకాలను కోల్‌కతాలోని కాలేజీ స్ట్రీట్‌లోనూ, ఉద్బోధన్ కార్యాలయంలోనూ కొనుగోలు చేశారు. ఈ ఉద్బోధన్ కార్యాలయం రామకృష్ణ మఠానికి పుస్తకాలు ముద్రిస్తుంది.

తనకూ పుస్తకాలంటే ఇష్టం కనుక తన తండ్రి ఏయే పుస్తకాలు బాగుంటాయో ఎంపిక చేయడంలో తన తండ్రి పాత్ర కూడా ఉందని ప్రియాంకా చెప్పారు. కట్నం ఒక్క పైసా కూడా తీసుకోనన్న భర్త నిర్ణయం తననెంతో ఆశ్చర్యపరిచిందని ఆమె చెప్పారు.



తమ కొడుకు కట్నానికి వ్యతిరేకం అన్న విషయం తెలుసని. కట్నం తీసుకోనన్న కొడుకు నిర్ణయంతో తామూ ఏకీభవించామని వరుడి తల్లిదండ్రులు చెప్పారు.

వరుడికి ఇచ్చిన పుస్తకాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, బంకించంద్ర చటర్జీ, శరత్ చంద్ర ఛటోపాధ్యాయ్ పుస్తకాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

**– యామిజాల జగదీశ్**

# అరుదైన పుస్తకాలు

## డెడ్ సీ స్క్రోల్స్: ఒక గొర్రెల కాపరి యాదృచ్ఛిక విజయం

కొన్నిసార్లు ప్రపంచాన్ని మార్చే గొప్ప ఆవిష్కరణలు అత్యంత సాధారణమైన పనుల ద్వారా జరుగుతాయి.

1947లో ఒక బెడౌయిన్ గొర్రెల కాపరి తన మందలో తప్పిపోయిన ఒక గొర్రె కోసం వెతుకుతూ మృత సముద్రం (Dead Sea) తీరంలోని ఒక గుహ వద్దకు చేరుకున్నాడు. లోపల ఏముందో అని తెలుసుకోవడానికి అతను ఒక రాయి విసిరాడు.

ఆ రాయి తగిలి లోపల మట్టి పాత్రలు పగిలిన శబ్దం వచ్చింది. కుతూహలంతో లోపలికి వెళ్లిన అతనికి ప్రాచీన తోలు పత్రాలతో నిండిన కుండలు కనిపించాయి. ఇవే చరిత్రలో అత్యంత విలువైనవిగా భావించే 'డెడ్ సీ స్క్రోల్స్'.

డెడ్ సీ స్క్రోల్స్ క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 1వ శతాబ్దం వరకు ఉన్న కాలానికి చెందినవి. ఈ స్క్రోల్స్‌లో బైబిల్ గ్రంథాలు, ప్రార్థనా గీతాలు, అప్పటి సమాజ నియమ నిబంధనలు ఉన్నాయి.

సుమారు 2000 సంవత్సరాల పాటు ఉప్పు గాలి ఉన్న ఆ గుహల్లో ఇవి ఎలా భద్రంగా ఉన్నాయనేది శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరిచింది.

ఈ ఆవిష్కరణ తర్వాత ఆ ప్రాంతంలో మరిన్ని పరిశోధనలు జరిగాయి, తద్వారా వేలాది పత్రాల ముక్కలు లభించాయి. మత చరిత్రను, భాషా పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి ఇవి ఒక నిఘంటువులా పనిచేశాయి. 2021 వరకు కూడా ఈ అన్వేషణలు కొనసాగడం చూస్తుంటే, చరిత్ర తన రహస్యాలను పొరలు పొరలుగా ఎలా విప్పుతుందో అర్థమవుతుంది.

**– రవికుమార్**

'సంఘీ' భావం



# అవినీతి నిరోధానికి అంతమెప్పుడు?

దేశంలోను, రాష్ట్రంలోను అవినీతిని అరికడతామని ప్రభుత్వాలు పదేపదే ప్రకటనలు గుప్పిస్తుంటారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవినీతి అధికారులపై తీసుకునే చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్రధానంగా జాతీయ స్థాయిలో సిబిఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు, రాష్ట్ర స్థాయిలో ఏసీబీ, విజిలెన్స్ విభాగాలు అవినీతి అధికారులను పట్టుకుని చట్టం ముందు ప్రవేశపెట్టినా ఆశించిన మేరకు శిక్షలు పడటం లేదు. ముఖ్యంగా చట్టంలో లొసుగులను, రాజకీయాల పలుకుబడిని ఉపయోగించుకుని శిక్షల నుంచి బయటపడుతున్నారు. అవినీతి నిరోధక శాఖకు చెందిన అధికారులు మూడు రకాలైన కేసులను ప్రధానంగా దర్యాప్తు చేస్తారు. ముందుగా ట్రాపింగ్ కేసులు. ఏదైనా అధికారి లంచం డిమాండ్ చేస్తే బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి లంచం ఇస్తుండగా పట్టుకునే విధంగా సహకరిస్తాడు. ఇక రెండో అంశాన్ని పరిశీలిస్తే ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని సదరు అధికారి ఇంట్లో సోదాలు నిర్వహించి పట్టుకుంటారు. ఇక మూడవది ఏదైనా కార్యాలయంలో అంతులేని అవినీతి రాజ్యమేలు తుందని తెలిసినప్పుడు మూకుమ్మడిగా అధికారులు అక్కడికి వెళ్లి సోదాలు చేస్తారు. ఈ మూడు విధానాల్లో అవినీతి అధికారులను పట్టుకుని అరెస్టులు చూపిస్తారు. అనంతరం కోర్టులో హాజరుపరుస్తారు. ఎప్పుడైతే అరెస్ట్ అవుతారో ఆయా అధికారులను విధులను సస్పెండ్ అంటే తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అవుతాయి. ఇక్కడి వరకు బాగానే ఉంటుంది. దీని తరువాత అసలు కథ మొదలవుతుంది. సదరు అవినీతి అధికారి అనేక మార్గాల ద్వారా తన తప్పులేదని ఉద్దేశపూర్వకంగా ఇరికించారని పేర్కొంటారు. దీనిపై ఒక నివేదిక తయారు చేసి ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి పంపిస్తారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ముందుకు సాగుతారు. లేకపోతే అక్కడితో ఈ కేసును వదిలేస్తారు. అనంతరం సదరు అధికారి తనపై నేరారోపణ రుజువు కాలేదని తిరిగి విధుల్లో తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాస్తారు. ప్రభుత్వం అంగీకరించి అతనిని ఉద్యోగంలో తీసుకుంటుంది. సస్పెండ్ అయిన కాలంలో నిబంధనల ప్రకారం 50 శాతం జీతాన్ని చెల్లిస్తారు. తనపై నేరారోపణ రుజువు కాలేదు కాబట్టి సస్పెండ్ కాలంలో మిగిలిన జీతాన్ని చెల్లించాలని అర్జీ పెట్టుకుని మిగిలిన 50 శాతం కూడా తన ఖాతాలో జమ చేసుకుంటారు. దీనివల్ల అవినీతి అధికారిని తిరిగి విధుల్లో తీసుకోవడమే కాకుండా అతను ఖాళీగా ఉన్న నెలలకు కూడా పూర్తి స్థాయి జీతం అందుతుంది. అవినీతి కేసుల్లో పెద్దగా శిక్షలు పడవు కాబట్టి తిరిగి అవినీతి అక్రమాలను కొనసాగిస్తారు. ఏసీబీ అధికారులు నమోదు చేసే కేసుల్లో కేవలం 2 నుంచి 5 శాతం మాత్రమే కోర్టుల్లో శిక్షలు పడుతుంటాయి. దీనికి కూడా చాలా సంవత్సరాలు పడుతుంది. ఉదాహరణకు గతేడాది 2025లో తెలంగాణలో ఏసీబీ అధికారులు 199 కేసులు నమోదు చేసి, 273 మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసింది. 2024తో పోలిస్తే కేసుల సంఖ్యలో 29 శాతం, అరెస్టుల సంఖ్యలో 22.4 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ఏడాదిలో సుమారుగా 96 కోట్లకు పైగా విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను కూడా వెలికితీసింది. అవినీతికి పాల్పడిన అధికారితో పాటు అతనికి సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తారు. సహకరించిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు లేకపోయినా వారిపై కూడా కేసులు పెడతారు. చాలా సందర్భాల్లో అధికారులు తాము నేరుగా లంచం సొమ్ము స్వీకరించకుండా కింది స్థాయి ఉద్యోగులను పావులుగా వాడుకుంటారు. అయినప్పటికీ లంచం ఇచ్చిన పరిస్థితులను బట్టి అధికారినే కీలక నిందితుడిగా ఏసీబీ అధికారులు పేర్కొంటారు. డిప్యూటీ కలెక్టర్ల నుంచి జలమండలి జనరల్ మేనేజర్ స్థాయి వరకు అధికారులు లంచాలు స్వీకరిస్తూ పట్టుపడ్డారు. కొందరు డిప్యూటీ కలెక్టర్లు వంద కోట్లు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ దాఖలాలు కూడా ఉన్నాయి. ఇఎస్ఐ శాఖలో పనిచేస్తున్న కీలక అధికారిని అవినీతికి పాల్పడితే, అవమానాన్ని భరించలేక ఆమె భర్త ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చి ఆమె కూడా కూడా ఆత్మహత్యకు పాల్పడింది. చివరకు అవినీతికి పాల్పడినందుకు ఒక కుటుంబం చరిత్ర సమసిపోయిన ఘటన హైదరాబాద్‌లోనే జరిగింది. ఇంత జరిగినా అవినీతి బాగోతాలు ఏమాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి కూపాలుగా మారాయి. ఎన్ని చట్టాలు ఉన్నా, నిఘా సంస్థలు ఎన్ని పని చేస్తున్నా ప్రజల్లో చైతన్యం రానిదే అవినీతికి చరమగీతం పాడే అవకాశం ఉండదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

ఇలపావులూరి వెంకటేశ్వర్లు



# యమునా తీరాన.. పుష్కర తీర్థాన!

సమస్త జీవకోటి మనుగడకు ముఖ్యమైన పంచ భూతాలలో జలానిది అగ్రస్థానం అని చెప్పవచ్చు. కారణం జలం లేకపోతే జీవం లేదు. యుగయుగాల నుంచి మానవాళి మనుగడ నదీ తీరాలలోనే నివాసాలు ఏర్పాటు చేసుకొన్నారు. తమ సంతతి, సంస్కృతీ, సంప్రదాయాలు, తమ జాతి అభివృద్ధి చేసుకొన్నారు.

హిందూ ధర్మం ప్రకారం పరమాత్మ స్వరూపమైన ప్రకృతిలోని ప్రతి ఒక్కటి పూజ్యమైనవే! నింగీ, నేల, నిప్పు, నీరు, గాలి పంచభూతాలు. పరమేశ్వర ప్రతిరూపాలు.

అన్నింటికన్నా ముఖ్యమైన నీటిని అందించే నదులను 'నదీమ తల్లి' అని మాతృస్థానంలో ఉంచి గౌరవిస్తాం. పూజిస్తాం. ఆరాధిస్తాం.

మన దేశంలో వేలాది నదులు ప్రవహిస్తున్నాయి. వీటిలో నిరంతరం ప్రవహించే జీవనదులకు పన్నెండు సంవత్సరాలకు ఒకసారి 'పుష్కరాలు' నిర్వహించి ఉత్సవాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఆనవాయితీ. ఇది ఒక రకంగా జలానికి ఇస్తున్న అత్యుత్తమ గౌరవం.

పుష్కరాలు జరుపుకొనే నదులు వరుసగా గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమా/ తామ్రపర్ణి, తపతి/ బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు ప్రాణహిత.

ఈ పుష్కరాలను జ్యోతిష్య శాస్త్ర ప్రకారం బృహస్పతి (గురు) ఆ సంవత్సరం ఏ రాశిలో ఉంటాడో ఆ సంవత్సరం ఆ రాశీచక్రంతో ముడిపడి ఉన్న నదికి పుష్కరాలను జరుపుతారు. ఇది మన పూర్వీకులు ప్రాణప్రదమైన నీటికి ఇచ్చిన అత్యధిక ప్రాధాన్యతగా, పూజ్యనీయతగా భావించవచ్చు.

## పురాణ గాథ

పుష్కరాలకు సంబంధించి ఒక పురాణ గాథ కూడా వినిపిస్తుంది.

పుణ్య తీర్థ స్నానాల పేరిట మానవులు) పవిత్ర నదులలో తమ పాపాలను వదిలించుకోవడం పెరిగిపోయింది. ఆ పాపాల కారణంగా నదీమ తల్లులు ఇక్కట్లు పడసాగారు. తమ సమస్యకు తగిన పరిష్కారం చూపించి తమను కాపాడమని నదులు త్రిమూర్తులకు మొరపెట్టుకొన్నాయట.

అదే సమయంలో ఇదే సమస్య గురించి పరమేశ్వర అనుగ్రహం కోసం తుందిలుడు అనే బ్రాహ్మణుడు తపస్సు చేస్తున్నాడట. నిరంతరం శివనామ స్మరణ, పక్కవారి పట్ల ఆదరాభిమానాలు కలిగిన వివేకి తుందిలుడు.

నదీమ తల్లులకు అభయమిచ్చిన త్రిమూర్తులు తుందిలుని పిలిచి అతనిని ఈశ్వర అష్టమూర్తులలో ఒకటైన 'జల మూర్తి'లో శాశ్వత స్థానం ప్రసాదించారట. అప్పటి నుండి కోట్లాది పుణ్యతీర్థాలకు అధిపతిగా మారి సకల జీవ రాశిని పోషించే 'పుష్కర'(పోషణ) శక్తి పొందాడు తుందిలుడు. అందువలన నాటి నుండి అతను 'పుష్కరుడు' అని పిలవబడుతున్నారు.



బృహస్పతి ఏ రాశిలో ఉంటాడో ఆ రాశికి సంబంధించిన నది లోనికి పుష్కరుడు ప్రవేశిస్తాడు అని వాయు పురాణం పేర్కొంటోంది. అనేక ఇతర పురాణాలలో పుష్కర స్నాన మహత్యాన్ని, స్నాన ప్రక్రియ, ఇతర పూజలు, తర్పణాలు, దానాలు ఎలా చేయాలి వివరంగా తెలుపబడినాయి.

ఇక్కడ ఒక విషయాన్ని పేర్కొనాలి. నదులు కాకుండా పవిత్ర పుష్కరిణిలు కూడా పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలను జరుపుకోవడం కూడా కనపడుతుంది.

మొదటిది: రాజస్థాన్‌లోని 'పుష్కర్', తమిళనాడులోని కుంభకోణంలో జరిగే 'మహా మహం', రెండవది కాగా; మూడవది తమిళనాడులోని 'తిరుకళ్ళు కుంద్రం' (పక్షితీర్థం)లోని శ్రీ వేదగిరీశ్వర స్వామి ఆలయంలో ఉన్న 'శంఖు తీర్థం'. ఈ మూడు క్షేత్రాలలో విశేషంగా ఒకటి నుంచి పన్నెండు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పుష్కర స్నానం, పితృ పిండ తర్పణ ప్రదానాలు, దానధర్మాలు, జప, తప ధ్యానాలు చేయడం కనిపిస్తుంది.

## ఆది, అంత్య పుష్కరాలు

పంచమ వేదంగా ప్రఖ్యాతి గాంచిన మహాభారత అరణ్య పర్వంలో పుష్కరోత్సవం జరుపుకొంటున్న నది లోనికి పదివేల నదుల పవిత్రత ప్రవహిస్తుంది అని చెప్పబడినది.





బృహస్పతి తానూ ప్రవేశించిన రాశిలో సంవత్సరం పాటు ఉంటాడు. పుష్కరుడు కూడా తాను ప్రవేశించిన నదిలో పూర్తి సంవత్సర కాలం ఉంటాడు. అంటే ఆ సంవత్సరంలో ఎప్పుడు స్నానమాచరించినా ఫలితం లభిస్తుంది.

కానీ అధిక శాతం భక్తులు తొలి పన్నెండు రోజులను 'ఆది పుష్కరాలు' అని పిలుస్తూ పుణ్య స్నానాలకు, పిండ, తర్పణ, దాన జపాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అదే రకమైన ప్రత్యేకతను సంవత్సరం చివర వచ్చే పన్నెండు రోజులకు 'అంత్య పుష్కరాల' పేరిట ఇస్తారు.

**ఈ సంవత్సరం బృహస్పతి కర్కాటక రాశిలోనికి ప్రవేశించడం వలన యమునా నదికి పుష్కరాలు జూన్ నెల రెండవ తేదీన ప్రారంభం కాబోతున్నాయి.**

## యమునా నది

భారతదేశంలో ప్రవహించే జీవనదులలో రెండవ అతి పెద్ద నది యమున. యమునోత్రి హిమానీ నదం వద్ద ఉద్భవించి ఒక వెయ్యి మూడు వందల డెబ్బై కిలోమీటర్లు ప్రవహించి ప్రయాగ రాజ్ వద్ద త్రివేణీ సంగమం వద్ద గంగా నదిలో కలుస్తుంది. ఈ త్రివేణి సంగమ క్షేత్రం హిందువులకు పరమ పవిత్రం.

మార్గ మధ్యలో ఎన్నో ఉపనదులు యమునలో కలుస్తాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని లక్షల ఎకరాలను సశ్యామలం చేయడమే కాకుండా కోట్లాది మంది దాహార్తిని తీరుస్తుంది.

దేశ రాజధాని ఢిల్లీకి ప్రధాన నీటి వనరు యమునా నది. యమునా నదిని సూర్య పుత్రిగా పురాణాలు పేర్కొంటున్నాయి. మేఘాల, మెరుపుల అధి దేవత, విశ్వకర్మ పుత్రిక అయిన 'సజ్ఞదేవి'కి ప్రత్యక్ష నారాయణుడు అయిన సూర్యభగవానునికి జన్మించిన కవల పిల్లలలో ఒకరు యమున.

నరకాధిపతి అయిన యమధర్మరాజుకు తోడబుట్టిన ఈమెకు యమి, కాళింది, జమున అన్న పేర్లు కూడా ఉన్నాయి. యమునానది ప్రస్తావన నాలుగు వేదాలలో, పురాణాలలో కనిపిస్తుంది.

అశరీరవాణి ఆదేశం మేరకు చెరసాల నుండి బాలకృష్ణుని తీసుకొని బయలుదేరిన వాసుదేవుడు రేపల్లె చేరుకోడానికి వీలుగా తన ప్రవాహాన్ని రెండుగా చీల్చి దారి ఇచ్చింది యమున అని భాగవతం పేర్కొన్నది.

విష్ణు పురాణం ప్రకారం యమున గొప్ప తపస్సు చేసి శ్రీ మహావిష్ణు అవతారమైన శ్రీ కృష్ణభగవానుని వివాహం చేసుకొన్నట్లు తెలుస్తోంది. వీరికి ఎందరో కుమారులు ఉన్నట్లుగా చెప్పబడినది. విష్ణు, పద్మ, నారద, భగవత, మహాభారత పురాణాలలో యమునా నది గురించి విస్తృతంగా వివరించారు.

యమునా నది జలాలకు సమస్త



పాపాలను హరించే శక్తి ఉన్నట్లుగా తెలిపే అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. యమునా తీరంలో నివసించేవారికి మోక్షం లభిస్తుంది అని కూడా విశ్వసిస్తారు.

## పుష్కర విధులు-దానాలు

పుష్కర సమయంలో నదీస్నానం చేసి దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు విడిచిన వారికి అశ్వమేధ యాగం చేసిన ఫలితం లభిస్తుంది అని నారద మహర్షి స్వయం ధర్మరాజుకు చెప్పారట.

పుష్కర సమయంలో గతించిన పితృ దేవతలకు శ్రాద్ధం నిర్వహించాలి అని శాస్త్రం నిర్దేశించింది. ముఖ్యంగా తొమ్మిదవ రోజున చేసే పిండ ప్రదానం వలన పితృ దోషాలు తొలగిపోతాయి అంటారు.

పుష్కర సమయంలో విప్రులకు దశ విధ దానాలు అంటే గో, భూ, హిరణ్య, రౌప్య, వస్త్ర, తిల, ఆజ్య, ధాన్య, గుడా, లవణ దానం. ఇవి కాకుండా ప్రాతినిధ్యం పాలు, తేనే, ఔషధ, చందన ఇత్యాదులను దానం చేయడం పాప కర్మ తొలగించి పుణ్యగతులకు దారితీస్తుంది అని చెబుతారు. ముఖ్యంగా సూర్యోదయానికి ముందు చేసే దానం అత్యంత ఫలప్రదం అని శాస్త్రాలు తెలుపుతున్నాయి.

పుష్కర సమయంలో చేసే జపం, ధ్యానం, హోమం, దానం వలన పుష్కరం పాటు అన్ని పుణ్య నదులలో స్నానమాచరించిన పుణ్యం లభిస్తుంది.

## యమునా తీరంలో దర్శనీయ ప్రదేశాలు

పరమ పవిత్ర హిమాలయాలలో జన్మించిన పావన యమునా నదీ తీరంలో ఎన్నో దివ్య క్షేత్రాలు నెలకొని వున్నాయి.

యమున ఉద్భవించిన యమునోత్రి నుండి గంగా నదితో సంగమించే ప్రయాగరాజ్ వరకు ఎన్నో విశేష దేవాలయాలు, పురాణ ఘట్టాలతో ముడిపడి ఉన్న ప్రదేశాలు అనేకం కనిపిస్తాయి. శ్రీకృష్ణుడు గోపికలతో రాసక్రీడలు ఆడినది యమునా తీరంలోనే! మధుర, గోకులం, గోవర్ధనగిరి, బృందావనం.. అన్నీ కూడా లీలామానుష రూపుడైన శ్రీకృష్ణ భగవానునితో ముడిపడి ఉన్నవి కావడం విశేషం.

వీటి తరువాత ముఖ్యమైనది 'యమ-యమున' ఆలయం. నదీమతల్లి తన సోదరునితో కలిసి కొలువు తీరిన క్షేత్రం.

## యమ-యమున దేవాలయం

మధుర పట్టణంలోని 'విశ్రామ్ ఘాట్' వద్ద ఉన్న ఇలాంటి 'భాయ్ బెహెన్' ఆలయం మరెక్కడా లేదని చెప్పవచ్చు. వజ్రనాభుడు సుమారు అయిదు వేల సంవత్సరాల క్రితం నిర్మించారని చెబుతారు. గొప్ప భక్తాదరణ ఉన్న ఆలయం వెనుక ఒక పురాణం గాథ వినిపిస్తుంది.

ఒకసారి తోడబుట్టిన వానిని భోజనానికి ఆహ్వానించింది యమున. తోబుట్టువు పిలుపు మేరకు తరలివచ్చిన యమధర్మరాజు సోదరి చేసిన ఏర్పాట్లకు, ప్రేమాభిమానాలకు ఆనందించారట. ఆ సంతోషంలో సోదరిని ఏదన్నా వరం కోరుకోమని చెప్పారు.

యమున ఈ రోజున ఎవరైతే తమ తోడబుట్టిన వారితో కలిసి ఇక్కడ నీటిలో స్నానం చేస్తారో వారి పాపాలను తొలగించి మోక్షం ప్రసాదించమని కోరిందట. దీపావళి తరువాత రోజు వచ్చే 'భాయ్ దూజ్' రోజున లక్షల సంఖ్యలో సోదర సోదరీమణులు కలిసి వచ్చి స్నానమాచరించి యామి, యమ ధర్మరాజులను దర్శించుకొంటారు.

## మధుర


యమునా తీరంలో నెలకొని ఉన్నప్రముఖ పుణ్య తీర్థక్షేత్రం. శ్రీకృష్ణ జన్మభూమి. సప్త మోక్ష క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి మధుర. పురాణం కాలం నుండి ప్రముఖ వ్యాపార కేంద్రంగా పేరొందినది. రామాయణ, భారత, భాగవత పురాణాలతో పాటు అనేక ఇతర గ్రంథాలలో మధుర ప్రస్తావన, వైభవం కనపడుతుంది.



చంద్ర వంశ రాజైన పురూరవుని దేవ నర్తకి ఊర్వశికి జన్మించిన 'ఆయువు' ఈ నగరాన్ని నిర్మించినట్లుగా పురాణాలలో పేర్కొనబడినది. యాదవ రాజు 'మధు' పేరున ఈ నగరానికి మధుర అన్న పేరొచ్చినట్లుగా ఒక చారిత్రక కథనం. క్రీస్తు పూర్వం పర్యటించిన విదేశ యాత్రికులు మధుర గొప్పదనం గురించి తమ యాత్రా అనుభవాలతో ప్రత్యేకంగా పేర్కొన్నారు. వాసుదేవుని మేనమామ కంసుని రాజధాని. అతని మరణం కూడా ఇక్కడే జరిగింది.

శ్రీకృష్ణుడు జన్మించిన కారాగారం ఇక్కడే ఉన్నది. ప్రస్తుతం 'శ్రీకేశవ దేవ్ మందిరం'గా పిలవబడుతోంది. మరో విశిష్టమైన మందిరం శ్రీ ద్వారకాధీశ్ కొలువైనది. మధురలో చిన్న పెద్దా కలిపి అయిదు వేల పైచిలుకు ఆలయాలు ఉన్నాయి అని చెబుతారు. హిందూ ధర్మంతో పాటు ఇక్కడ జైన, బౌద్ధ మాటలు కూడా అత్యంత ఆదరణ పొందినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోంది.

యమునా నదిలో పుణ్య స్నానం ఆచరించి ఇరుకైన పట్టణ వీధులలో తిరుగుతూ ఆలయ సందర్శనం చేయడం అత్యంత మధురమైన అనుభవం.



## గోకులం

యమునను నడిరేయి దాటినా నటన సూత్రధారి శ్రీకృష్ణుడు తన బాల్యాన్ని గడిపిన ప్రదేశం. కంసుడు పంపిన పూతన ఇత్యాది రాక్షసులను



సంహరించింది ఇక్కడే! యశోదకు ముల్లోకాలను చూపినది, గొల్లభామలను ఆట పట్టించింది, గోపబాలకులతో కలిసి సామాన్య బాలునిగా ఆటపాటలు ఆడిన దివ్య క్షేత్రం గోకులం. మధురకు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అనేక పురాతన ఆలయాలు, మందిరాలు కనపడతాయి. అన్నే దర్శనీయలే!

## గోవర్ధన గిరి

విష్ణుభక్తులకు అత్యంత పవిత్రమైన ప్రదేశం గోవర్ధన గిరి. దీపావళి తరువాత సకాలంలో వానలు కురిపించి పాడిపంటలు అభివృద్ధికి దోహదం చేసిన దేవేంద్రునికి ప్రత్యేక పూజలు చేయడం గోపాలకులు ఆనవాయితీ. కానీ బాలకృష్ణుడు మనకు సమస్తం ఇస్తున్న గోవులను పూజించాలి కానీ కనపడని ఇంద్రుని పూజ చేయడం ఎందుకు అని ప్రశ్నించి గోపూజ జరిపించారు. ఆగ్రహించిన మహేంద్రుడు నిరంతరాయంగా భీకర వర్షాన్ని కురిపించాడు. ఇక్కట్లకు గురైన వారిని కాపాడటానికి గోపాలకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికిన వేలితో ఎత్తారు. ఆయన అవతార పురుషుడు అని అర్థం చేసుకొన్నా అమరాధిపతి క్షమాపణ కోరారు. ప్రతి నిత్యం వందలాది భక్తులు భజనలు చేస్తూ, పాటలు పాడుతూ గోవర్ధన గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. దీపావళి మరునాడు విశేషంగా గోవర్ధన గిరి పూజ, ప్రదక్షిణ నిర్వహిస్తారు. దక్షిణాదిన అరుణాచల గిరి ప్రదక్షిణ ఎంత ప్రాముఖ్యమైనదో అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యత కలిగినది గోవర్ధన గిరి ప్రదక్షిణ.

## బృందావనం

బృంద అంటే తులసి. తులసి మొక్కలతో నిండిన ప్రదేశం. పరంధామునికి తులసిమాలలు అంటే యెంత మక్కువో మనందరికీ తెలుసు. బృందావనం శ్రీకృష్ణ లీలకు, రాస క్రీడకు ప్రసిద్ధి. భక్తులకు అత్యంత ఆరాధ్యదాయకమైన క్షేత్రం. బృందావనంలో ఎన్నో ఆలయాలు, మందిరాలు వనాలు కనపడతాయి. ప్రతిఒక్కటీ నీలమేఘశ్యాముని లీలతో నిండినవే కావడం బృందావనం ప్రత్యేకత. ప్రేమ మందిరం, బాంకీ బీహారీ ఆలయం, నిధివన్, విశ్రాం ఘాట్ తప్పక సందర్శించవలసినవి. అడుగడుగునా శ్రీకృష్ణ లీలలు స్ఫురించే పవిత్ర పావన ప్రదేశం యమునా తీరం.

## పుష్కర స్నానం

ఇంతటి పవిత్రత కలిగిన యమున ప్రస్తుతం విపరీతమైన కాలుష్యం ముప్పును ఎదుర్కొంటోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నది ప్రక్షాళనకు అనేక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా యమునోత్రి, మధుర, ఆగ్రా, బృందావనం పుష్కర స్నానం చేయడానికి అనువైనవి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అవకాశం ఉన్నవారు పుణ్యప్రదమైన పుష్కర స్నానం తగు జాగ్రత్తలు పాటిస్తూ చేసి, పుష్కర యాత్రను క్షేమంగా జయప్రదం చేసుకోవాలని ఆశిస్తున్నాం.

# ఆవిష్కరణలకు పునాది ప్రశ్నించే తత్వమే!

పిల్లలు తాము చూసిన ప్రతి అంశం గురించి తెలుసుకోవాలనే ఉత్సుకతతో తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, ఉపాధ్యాయులను ప్రశ్నల వర్షంలో ముంచేస్తారు. ఆకులు పచ్చగానే ఎందుకు ఉన్నాయి? వంటింటిలోని ప్రెషర్ కుక్కర్ విజిల్ మోత ఎందుకు చేస్తోంది? పసుపును, సున్నాన్ని కలిపితే ఎర్రని పదార్థం ఎందుకు వచ్చింది? సోడా సీసా మూత తీయగానే బుస్సుమని నురగలతో కూడిన ద్రవం ఎందుకు కనిపిస్తుంది? దెబ్బ తగిలి రక్తం కారినపుడు అమ్మ పసుపు పూసి గుడ్డతో ఎందుకు కడుతుంది? ఇలాంటివి నిత్యం ప్రశ్నించడం అనే పునాది మీదనే శాస్త్రసాంకేతిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. పిల్లలు ప్రశ్నలు అడిగితే విసుక్కోవడం, సమాధానం చెప్పకపోవడంతో వారిలో తెలుసుకోవాలనే జిజ్ఞాసను ఆదిలోనే తుంచేస్తున్నామని, అదే పిల్లలు ప్రశ్నించడం మానేసి అజ్ఞానాన్ని మూటకట్టుకొని కాలం గడుపుతారు. నిజానికి నేటి సమాజంలో ప్రశ్నించే వారిని అవిధేయులని, విప్లవకారులని, విసిగించే వారని ముద్ర వేస్తున్నాం. పిల్లలు అడిగే ప్రతి అర్థవంతమైన ప్రశ్నకు నిదానంగా, ఓపికగా సమాధులు చెప్పడం ఇంట్లో తల్లితండ్రుల నుంచే మొదలు కావాలి. అమ్మా నాన్నలు థింకింగ్, నేర్చుకోవాలనే తపన పెరగడం (క్యూరియాసిటీ), విజ్ఞాన సముపార్జనకు రహదారులు పడడం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడం, సంబంధాలు పెరగడం, పనిలో సంతృప్తి కలగడం, విజ్ఞాన విస్తృతులు పెరగడం, మెదడు పదునెక్కడం, ప్రకృతిని అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసం పెరగడం,లోతైన విషయ అవగాహన కలగడం, సమస్యలకు సమాధానా లను వెతికే గుణం పెరగడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

ప్రశ్నించే నైపుణ్యం అంటే తరగతి గదిలో సరైన సమయంలో సరైన ప్రశ్నలు అడిగే సామర్థ్యం అని తాము చూసే ప్రతి విషయం గురించి తెలుసుకోవాలనే తపనతో పిల్లలు ప్రశ్నలు అడుగుతూ ఉంటారు.

పిల్లలు మాత్రమే ఏమిటి, పెద్దలకు కూడా ఇలాంటి ప్రశ్నలు వేయడం వల్లనే అద్భుత ఆవిష్కరణలు ఆవిష్కరించబడ్డాయి. "చెట్టుపై నుంచి ఆపిల్ కిందికే ఎందుకు పడింది?" అనే న్యూటన్ వేసిన ప్రశ్న, అలాగే "నీటికి రంగు లేనప్పటికీ సముద్రజలం నీలి రంగులో, ఆకాశం కూడా నీలి రంగులో ఎందుకు ఉన్నాయి?" అనే ప్రశ్న సర్ సి.వి.రామన్‌కు రావడం వల్లనే కదా గొప్ప వైజ్ఞానిక శాస్త్ర ఆవిష్కరణకు దారి తీసాయని మనకు తెలుసు. నిజానికి ప్రశ్నించే తత్వమే సృజనకు, ఆవిష్కరణలకు, వైజ్ఞానిక, టెక్నాలజీ విషయ పరిజ్ఞాన విస్తృతికి పునాది అని తెలుసుకోవాలి.

### జ్ఞాన తృష్ణకు సాధనం ప్రశ్నించడమే!

తెలుసుకోవాలనే తపనను ప్రశ్నించడం సూచిస్తుంది.



తమ పనుల్లో పడి పిల్లలు ప్రశ్నలు అడిగితే వెంటనే విసుక్కోవడం తరుచుగా జరుగుతున్నది.

సమాధానం తెలిస్తే వెంటనే చెప్పండి. తెలియకపోతే తెలుసుకొని సరైన సమాధానం చెప్పండి. అడిగిన ప్రతి అర్థవంతమైన ప్రశ్నకు బహుమతి ఇవ్వండి. సమాధానాలు తెలియకపోతే తెలుసుకొని చెప్పండి. ప్రశ్నలు అడిగేలా వారిని సిద్ధం చేయడం. తెలియని విషయం పట్ల ఇతరుల నుండి సమాధానాలు పొందితే దినదినం విజ్ఞానం పెరుగుతుంది.

ప్రశ్నించడం మానేస్తే అజ్ఞాన చీకట్లు జీవితాంతం మనతోనే వస్తాయి. నిజానికి ప్రశ్నించే నైపుణ్యం పిల్లల్లో ఉన్నట్లయితే ఆ చిన్నారుల్లో అభిజ్ఞ అభివృద్ధి (కాగ్నిటివ్ డెవలప్‌మెంట్), క్రిటికల్ తెలుసుకోవాలి. ప్రశ్నించడం అంటే తెలుసుకోవాలనే జ్ఞాన తృష్ణ. తెలియంది తెలుసుకోవడానికి సరైన మార్గం ప్రశ్నించడమే. పిల్లలు ప్రశ్నించే విధంగా బోధనలను కొనసాగించడం ఉపాధ్యాయుడి అసలైన సామర్థ్యం అవుతుంది. బలమైన విద్యా పునాదిని నిర్మించడానికి ప్రశ్నించే నైపుణ్యమే ప్రధానం అని మరిచిపోవద్దు.

– డా॥ మధుసూదన్ రెడ్డి

ఈ వారం కవిత్వం

# నాన్న.. వెలుగుతున్న జ్ఞాపకం



నా కళ్ళల్లో వెలుగు కోసం
చీకట్లో పోరాడే నువ్వు
నా సంతోషం కోసం
ఎన్ని బాధలునైనా భరించే
నువ్వు
నా భవిష్యత్తు కోసం
నీ వర్తమానాన్ని కరిగించిన
నువ్వు
నేను ఎన్ని తప్పులు చేసినా
చిరునవ్వుతో సరిదిద్దే నువ్వు..
అందుకే నాన్న నువ్వంటే నాకిష్టం
నీ తిట్ల వెనుక గుడార్థం
నీవు నాకు నేర్పిన గుణపాఠం
నీ జీవిత పరమార్థం
నా బాగోగుల జీవితానికర్థం
అందుకే నాన్న నువ్వంటే నాకిష్టం
నీ ఆలోచనల ధ్యేయం
నా గెలుపుకు ప్రస్థానం
నువ్వు పడే మనోవేదన
నాకు తెలియని ప్రశ్నకు సమాధానం
నీ కలలు విడిచి.. నా కలలు పండించావు
నువ్విచ్చిన సముద్రమంత ప్రేమ
నా జీవితానికి ఆధారమవుతుంది
నాన్న నువ్వు ఒక వెలుగుతున్న జ్ఞాపకం

– సి.రమేశ్ కుమార్

# భావన

అతడు అలిగిన వేళ
ఆమె చెంతకు చేరుతుంది
చిలిపిగా కళ్ళలోకి చూస్తుంది
అంతే ఇక.... ఆమె సిగలో
పువ్వు అయి పరిమళిస్తాడు
ఆమె అలిగిన వేళ
తడబడే పెదవుల పైన
తడి ముద్ర వేస్తాడు... అంతే ఇక
ఆమె మోవిపై నెలవంక
పూస్తుంది..
అతడు ఆగ్రహించిన వేళ
ఆమె అతడి కళ్ళలోని
ఎరుపుదనాన్ని చెంపలకు
పూసుకుంటుంది. రాత్రి విందు
భోజనంలో ఎరుపెక్కిన
బుగ్గల్ని వడ్డిస్తుంది.
కంచంలో
కడిగేసిన కోపాన్ని ఉదయం
పారబోస్తుంది.
ఆమె కినుక వహించిన వేళ
పలుకే బంగారమవుతుంది
రెండు మాటలు సవ్వడి కోసం
ఆమె కాలి మువ్వగా మారిన వేళ..
అలిగిన అలివేణి ఆలింగనం
చేసుకుంటుంది.
సరదాల వేళ నల్లనివాడు
అయితేనేమి నా పాలిట బంగారం..
నా నుదిటి సింధూరం.. అంటుంది.
వంకే లేని తను నానెల వంక
ఎప్పటికైనా నా నిండు జాబిల్లి తనే
అంటూ మురిసిపోతాడు
ఇద్దరైన వాళ్లది ఒకటే జీవితం...
మనసులు రెండు అయినా మాట
ఒకటే.. ఆలోచనలు మెండైనా
ఆచరణ ఒకటే..
దేహాలు రెండైనా పుష్పించిన
దేహం ఒకటే
సంసారంలో సరిగమలే కాదు
చిటపటలు కూడా ఉంటాయి
భావన సక్రమమైతే అవి వాన
చినుకులు లేకుంటే నిప్పురవ్వలే,,...

– కె.రవీంద్రబాబు

# మనసంటే..

మాటల్లో
చెప్పలేని
మౌనం..!
కళ్లలో
దాచుకున్న
వేల కథల గానం..!!
నవ్వుతూ కనిపించినా
లోపల తుఫానై
ఉండేది..!

అందరితో
కలిసిపోయినా
ఒంటరితనమే
మిగిలేది..!!

అది ఆడమనసైతే
ఇంకా లోతైన
సముద్రం..!



ప్రేమిస్తే ప్రాణమంతా ఇస్తుంది
బాధిస్తే నిశ్శబ్దమై పోతుంది..!!
అమ్మగా మారితే
అంతులేని త్యాగం
భార్యగా నిలిస్తే
ఇంటికే దీపస్తంభం..!!
కూతురై నవ్వితే
ఇల్లంతా వసంతం
చెల్లెలై పలికితే
మనసంతా
ఆనందం..!!

కన్నీళ్లు దాచుకుని
కలలను మోసే
హృదయం
అదే ఆడమనసు..
అర్థం చేసుకున్నవారికే
అది ఒక అందమైన కావ్యం..!!

– డా.పూసపాటి వేదాద్రి



# నాగలి మొన

నాగలి మొన
భూమిని రాసుకుందంటే
మట్టి నిండా ఆకుపచ్చ పంటలు!
జనం కడుపుకు
బల అతిబల మహాబల!!
ఇక ఆకలి మాట ఏ నోట ఉండదు!
నిరంతరంగా ప్రేవులే మరి

– కందాళై రాఘవాచార్య

**సింగిల్ పేజీ కథ**

# కొత్త బంగారు లోకం

ఎనిమిది గంటల పని సమయం.. అన్న హక్కు ప్రపంచ కార్మికులు పోరాడి సాధించిన విజయం. ఇప్పుడు సాఫ్ట్ వేర్ కంపెనీలు వచ్చాయి. ఎనిమిది నుండి పన్నెండు గంటలు, మరికొన్ని పదహారు గంటలు పని చేయిస్తున్నా ఎటువంటి వ్యతిరేకత చూపించకుండా పని చేస్తున్నారు. పనిచేస్తున్న వారి ఆరోగ్యం గురించి, వారి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్న ఆలోచన యాజమాన్యం వారికీ లేదు.

సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న భార్గవ మొదటిసారి తన వ్యతిరేకతను చూపించాడు. "మీరు చెప్పినన్ని గంటలు నేను పని చేయను. ఎనిమిది నుండి పది గంటల వరకు పని చేస్తాను" అంటూ తన టీమ్ సభ్యులముందే తన పైఅధికారికి చెప్పాడు. ఆ అధికారి కోపంతో వెళ్లిపోయాడు.

"భార్గవా, మీరు తొందరపడుతున్నారేమో!" అడిగాడు.

"నేనేమి తొందర పడలేదు. గత నెలరోజులుగా ఆలోచిస్తూనే వున్నాను. మా ఆవిడతోనే చెప్పాను"



"మీ ఆవిడ ఏం చెప్పారు"

"జీతం కోసం కాదు జీవితం. జీవితం కోసం జీతం. అందరూ అంత పెద్ద జీతంతో పూలబాటలో పయనిస్తున్నారు అనుకొంటారు. కానీ ఆలోచిస్తే అదొక ముళ్లబాట. పెద్ద జీతం ఇచ్చే ఉద్యోగం పోయినా పరవాలేదు. మరో దారి చూసుకొందాం" అంటూ ధైర్యం చెప్పింది. ఆ ధైర్యంతోనే నా వ్యతిరేకతను చూపించాను" అన్నాడు రాఘవ. మరో వారం రోజులకు రాఘవను ఉద్యోగంలోంచి తీసేసారు.

ఆ టీం సభ్యులలో బాధ, ఆవేదన కలిగినా రాఘవ నందు ఎటువంటి బాధ కలుగలేదు, అందరితో సరదాగా వీడ్కోలు చెప్పి ఇంటికి వెళ్ళాడు.

రాఘవ తల్లి తండ్రులు, అత్తమామలు వచ్చారు. ఆ పెద్దలను చూస్తూ "ఇది మేమిద్దరం బాగా అలోచించి తీసుకొన్న నిర్ణయం. ఆయన పనిమీద సాఫ్ట్‌వేర్ కంపెనీకి మధ్యాహ్నం ఒకటింటికి క్యాబ్‌లో వెళ్తే పని ముగించుకొని ఉదయం మూడు లేక నాలుగు గంటలకు ఇంటికి వస్తున్నారు. ఇది కొంత కాలం అనుకొంటే పరవాలేదు. ఇలాగే జీవితాంతం పనిచెయ్యాలట. ఇంట్లో మొదట నేనే వ్యతిరేకత చూపించాను" రాఘవ భార్య హర్షిణి అంది.

"ఫ్యాక్టరీలో నేను చేసిన కంపెనీలో ఎనిమిది గంటల పని మాత్రమే. ఎనిమిది గంటల తరువాత ఒక్క క్షణం కూడా కంపెనీలో ఉండకుండా ఇంటికి వచ్చేవారం" అన్నాడు రాఘవ తండ్రి.

"ఆయన ఉదయాన ఇంటికి వచ్చినా మరికొంతసేపు కంపెనీ పని చేయవలసి వస్తోంది. పని పూర్తి చేసుకొని వెళ్తాను.. అని ఆఫీసులో అంటే ఇంటికెళ్లి పూర్తి చేయండి, మీ కోసం మరో క్యాబ్ పంపలేము అంటూ మేనేజ్ మెంట్ చెప్పింది. ఇంకొన్ని రోజులు అయిందంటే ఆయన ఆరోగ్యం బాగా దెబ్బ తింటుంది" అంది హర్షిణి.

......

'ఎనిమిది గంటలు' (ఎయిట్ అవర్స్) కంపెనీ ప్రకటన ఆశ్చర్యంతో చూసాడు. ఎనిమిది గంటలు మాత్రమే పని, చదువుకున్నవారు, సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి బయటకు వచ్చినవారికి ముఖ్యత్వం.. అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కంపెనీకి దరఖాస్తు పంపిన కొన్ని రోజులకే ఇంటర్వ్యూకు రమ్మన్నారు.

ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు.

మునుపటిలాగా ఒరేయ్ అనబోతూ నిగ్రహించుకొని "సార్ మీరు ఇక్కడ?"

"ఒరే విశ్వక్, నన్ను ఒరేయ్ అంటూ పిలవరా, మనం ఎప్పటినుండో స్నేహితులం. సాఫ్ట్ వేర్ ఉద్యోగం నీవు ఎలా వదులుకొన్నావు?" అన్నాడు రాఘవ.

"భార్యా బిడ్డల బాగోగులు చూసే సమయం లేని ఉద్యోగం వద్దనుకుని మానుకున్నాను"

"ఇంత గొప్ప అంతస్తులోకి ఎలారా రాఘవా?" అడిగాడు.

"విశ్వక్, నేనూ మా ఆవిడా కలసి సాఫ్ట్ వేర్ ఆఫీస్ ప్రారంభించాం. మెల్లగా వృద్ధి చెందింది. కంపనీకి ఎయిట్ అవర్స్ అన్న పేరు పెట్టాం. ఫ్యాక్టరీ లాగా ఎనిమిది గంటల పని మా ముఖ్య ఉద్దేశం. అక్కడ పదహారు గంటలు పని చేసే జీతం కన్నా సగం జీతం ఎనిమిది గంటల పనికి వస్తుంది. కానీ మా దగ్గర పని చేసేవారు ఆరోగ్యంగా, ఆనందంగా కొత్త బంగారు లోకంలో కుటుంబ సభ్యులతో సరదాగా జీవిస్తాడు" అన్నాడు రాఘవ.

...........

హర్షిణి ఉలిక్కిపడి లేచింది. డిజిటల్ గడియారంలో నాలుగు గంటలయింది. 'కొత్త బంగారులోకం' కల నిజం కావడానికి అవకాశం లేని కల అనుకొంటూ భర్త రాఘవ కోసం చెమ్మగిల్లిన కళ్ళతో ఎదురు చూడసాగింది.

– ఓట్ర ప్రకాష్ రావు

# విద్యార్థి వికాసానికి కీలకం.. వాక్చాతుర్యం



ఇప్పటి ప్రపంచం వేగంగా మారుతున్న సమాచార యుగం. విజ్ఞానం, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, మనిషి తన ఆలోచనలను స్పష్టంగా, సమర్థంగా వ్యక్తీకరించగలగడం అత్యంత ముఖ్యమైన నైపుణ్యంగా నిలుస్తోంది. ముఖ్యంగా విద్యార్థి దశలో మాట్లాడే నైపుణ్యం అభివృద్ధి చెందకపోతే, వారి విద్యా ప్రయాణం మాత్రమే కాకుండా భవిష్యత్తు వృత్తి జీవితం కూడా ప్రభావితం అవుతుంది. అందువల్ల విద్యార్థుల్లో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించడం ఒక విద్యా అవసరం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతగా కూడా చూడాలి.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో చదవడం, రాయడం, పరీక్షలు రాయడం వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, మాట్లాడే నైపుణ్యాల అభివృద్ధి కొంతవరకు నిర్లక్ష్యం చెయ్యబడుతోంది. అనేక మంది విద్యార్థులు మంచి జ్ఞానం కలిగి ఉన్నప్పటికీ, తమ ఆలోచనలను సరైన రీతిలో చెప్పలేక వెనుకబడుతున్నారు. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తుంది. కాబట్టి పాఠశాల స్థాయిలోనే మాట్లాడే నైపుణ్యాలపై దృష్టి పెట్టడం అత్యవసరం. మాట్లాడే నైపుణ్యం అభివృద్ధికి మొదట అవసరమైంది సరైన వాతావరణం. విద్యార్థులు భయపడకుండా, విమర్శలకి గురికాకుండా మాట్లాడగల వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించాలి. ఒక విద్యార్థి తప్పు చేసినా అతన్ని తప్పుపట్టడం కాకుండా, ప్రోత్సహిస్తూ సరిదిద్దాలి. ఈ విధంగా విద్యార్థుల్లో ధైర్యం పెంపొందుతుంది.

తరగతి గదిలో చర్చలు, వాదోపవాదాలు, కథలు చెప్పించడం, పాత్రాభినయం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మాట్లాడే సామర్థ్యం పెరుగుతుంది. ఇవి విద్యార్థులకు ఆలోచించే శక్తిని, వాక్చాతుర్యాన్ని పెంచుతాయి. ముఖ్యంగా సమూహ చర్చలు వారి ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి మంచి వేదికగా మారుతాయి.

అదేవిధంగా, పఠన అలవాటు కూడా మాట్లాడే నైపుణ్యంపై ప్రభావం చూపుతుంది. పుస్తకాలు, పత్రికలు చదవడం ద్వారా పదసంపద పెరుగుతుంది. ఎక్కువ పదజాలం తెలిసిన విద్యార్థి తన భావాలను మరింత స్పష్టంగా వ్యక్తపరచగలుగుతాడు. కాబట్టి విద్యార్థులను పఠనానికి ప్రోత్సహించడం చాలా అవసరం.

**సాంకేతికత కూడా ఈ విషయంలో సహాయకారి.** వీడియోల ద్వారా ప్రసంగాలు చూడడం, ఆడియోలు వినడం, ఆన్‌లైన్ చర్చల్లో పాల్గొనడం వంటి మార్గాలు విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా భాషా అభ్యాస యాప్‌లు విద్యార్థులకు సహాయపడుతున్నాయి. అయితే సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని గుర్తించాలి.

**ఇంటి వాతావరణం కూడా ఎంతో ప్రభావం చూపుతుంది.** తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటం, వారి అభిప్రాయాలను వినడం, ప్రశ్నలు అడగడం వంటి అలవాట్లు పెంచితే పిల్లల్లో మాట్లాడే ధైర్యం పెరుగుతుంది. పిల్లలు ఏ విషయాన్నైనా స్వేచ్ఛగా చెప్పగలిగే వాతావరణం ఇంట్లో ఉండాలి.

**మరొక ముఖ్యమైన అంశం.. భాషా భయం తొలగించడం.** చాలా మంది విద్యార్థులు ముఖ్యంగా ఆంగ్ల భాషలో మాట్లాడేటప్పుడు భయపడుతుంటారు. ఈ భయాన్ని తొలగించేందుకు చిన్న చిన్న ప్రయత్నాలతో ప్రారంభించాలి. రోజూ కొన్ని నిమిషాలు మాట్లాడడం, అద్దం ముందు ప్రాక్టీస్ చేయడం వంటి పద్ధతులు ఉపయోగపడతాయి.

ఉపాధ్యాయులు కూడా తమ బోధనా విధానంలో మార్పులు తీసుకురావాలి. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులను మాట్లాడేలా చేసే ప్రశ్నలు అడగాలి. ప్రతీ తరగతిలో కొంత సమయం విద్యార్థుల మాటలకోసం కేటాయించాలి. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

మొత్తానికి, మాట్లాడే నైపుణ్యం విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి మూలాధారం. ఇది కేవలం ఒక భాషా నైపుణ్యం కాదు, అది ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే సాధనం. విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పని చేస్తేనే విద్యార్థుల్లో ఈ నైపుణ్యం సమర్థవంతంగా అభివృద్ధి చెందుతుంది. భవిష్యత్తులో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కలిగిన పౌరులు కావాలంటే, నేటి విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యాలపై పెట్టుబడి పెట్టడం అత్యవసరం. ఇదే సమాజ పురోగతికి బలమైన పునాది అవుతుంది.

– తిప్పర్తి శ్రీనివాస్

**మారుతున్న వయసు అనేది ప్రకృతి నియమం. నిన్నటి బాల్యం నేడు యవ్వనంగా, నేటి యవ్వనం రేపు వృద్ధాప్యంగా మారడం సహజం. అయితే, ప్రస్తుత ఆధునిక కాలంలో మారుతున్న వయసు అనే మాట కేవలం శారీరక మార్పులకే పరిమితం కాకుండా.. మనుషుల ఆలోచనలు, బాధ్యతలు, జీవన శైలిలో వస్తున్న మార్పులకు కూడా సంకేతంగా నిలుస్తోంది.**

# మారుతున్న పెళ్లివయసు

సమాజంలో వస్తున్న మార్పులకు అద్దం పట్టే అంశాల్లో మారుతున్న పెళ్లి వయసు చాలా ముఖ్యమైనది.

ఒకప్పుడు అమ్మాయిలకు 18-20 యేళ్లు, అబ్బాయిలకు 22-25 యేళ్లు రాగానే పెళ్లిళ్లు చేసేవారు. కానీ ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం యువతీ యువకులు 28 నుండి 32 యేళ్ల వయసులో, లేదా ఆ పైన కూడా పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఈ మార్పుకు దారితీసిన ముఖ్య కారణాలు, దాని ప్రభావాలను పరిశీలిస్తే, నేటి తరం యువతీ యువకులు కేవలం డిగ్రీలతో ఆగిపోకుండా పీజీలు, పీహెచ్‌డీలు, లేదా ఉన్నత వృత్తివిద్యా కోర్సులు చదవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల చదువు పూర్తయ్యేసరికే 25 యేళ్లు దాటుతున్నాయి.

## ఆర్థిక స్వాతంత్ర్యం, కెరీర్

ముఖ్యంగా మహిళలు పెళ్లికి ముందే తమ కాళ్లపై తాము నిలబడాలని, మంచి పొజిషన్‌లో సెటిల్ అవ్వాలని ఆశిస్తున్నారు. అబ్బాయిలు కూడా సొంతంగా ఇల్లు, కారు లేదా మంచి బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నప్పుడే బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధపడుతున్నారు.

**పరిణతి:** జీవితంపై, బంధాలపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చాకే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన పెరిగింది. చిన్న వయసులో వచ్చే తొందరపాటు నిర్ణయాల కంటే, మానసిక పరిణతి వచ్చాక భాగస్వామిని ఎంచుకోవడం మంచిదని భావిస్తున్నారు.

## ఆలోచనా విధానంలో మార్పు

కుటుంబాలు, తల్లిదండ్రులు కూడా పిల్లలపై పెళ్లి ఒత్తిడిని తగ్గించారు. ముందు లైఫ్‌లో సెటిల్ అవ్వు, ఆ తర్వాతే పెళ్లి.. అనే ధోరణి నేటి



తల్లిదండ్రుల్లోనూ కనిపిస్తోంది.

**ఆర్థిక స్థిరత్వం:** దంపతులిద్దరూ సంపాదిస్తుండటం వల్ల కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తగ్గి, విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగలుగుతున్నారు. మానసిక పరిణతి ఉండటం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకునే గుణం పెరుగుతుంది. చిన్న చిన్న విషయాలకే విడిపోయే ఆవేశాలు తగ్గుతాయి. వయసు పెరిగిన తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దగలరు.

## ఎదురవుతున్న సవాళ్లు

వయసు 30 యేళ్లు దాటిన తర్వాత పెళ్లి చేసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు (ముఖ్యంగా మహిళల్లో గర్భధారణలో), కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంతానలేమి సమస్యలు పెరగడానికి ఇది కూడా ఒక కారణం అవుతోంది.

30 యేళ్ల వరకు ఒంటరిగా, తమకు నచ్చినట్లు స్వతంత్రంగా బతికినవారు.. పెళ్లయ్యాక మరొకరి కోసం, వారి కుటుంబం కోసం సర్దుకుపోవడం కొంచెం కష్టంగా మారుతోంది. ఆలస్యంగా పిల్లలు కలగడం వల్ల, ఆ పిల్లలు సెటిల్ అయ్యే సమయానికి తల్లిదండ్రులకు వృద్ధాప్యం వచ్చేస్తోంది. దీనివల్ల జనరేషన్ గ్యాప్ సమస్యలు ఎక్కువవుతాయి.

ప్రస్తుతం మహిళల వివాహ సగటు వయసు 22.9 సంవత్సరాలకు, పురుషుల వయసు 25 సంవత్సరాలకు పెరిగింది. పెళ్లి కోసం భాగస్వామిని వెతకడం ప్రారంభించే సగటు వయసు కూడా 27 యేళ్ల నుండి 29 యేళ్లకు చేరింది. ప్రముఖ డేటింగ్ ప్లాట్‌ఫారమ్ 'క్వాక్-క్వాక్' సర్వేలో..

28 యేళ్లు పైబడిన 39 శాతం మంది డేటర్లు పెళ్లి అనేది జీవితంలో ఒక బలవంతపు బాధ్యత కాదని స్పష్టం చేశారు.

నేటి తరం కుటుంబం, పిల్లలు అనే బంధాలలో ఇరుక్కుపోవడానికి ఇష్టపడటం లేదు. ఒకప్పుడు ముసలితనంలో పిల్లలే ఆధారం అనుకునేవారు. కానీ నేటి ఉద్యోగాల రీత్యా పిల్లలు దూరంగా ఉంటున్నారు.

అలాగే, ఆధునిక వసతులతో కూడిన 'ఓల్డ్ ఏజ్ హోమ్స్' అందుబాటులోకి రావడం కూడా ఈ ఆలోచనకు కారణం. పెరుగుతున్న ఖర్చులు, ప్రైవేట్ ఉద్యోగాలలో అభద్రత కారణంగా యువత మొదటి ప్రాధాన్యత ఆర్థికంగా స్థిరపడటానికే ఇస్తున్నారు.

తమ జీవితంలో అత్యంత కీలకమైన 20, 30 యేళ్ల వయసును యువతీ యువకులు కేవలం కెరీర్ బిల్డింగ్ కోసం, మల్టీ టాస్కింగ్ చేయడానికే కేటాయిస్తున్నారు. పెళ్లి, పిల్లల భారీ బాధ్యతలను మోయడానికి తాము మానసికంగా ఇంకా సిద్ధంగా లేమని భావిస్తున్నారు.



## సోలో లైఫ్‌లో ఉండే ప్లస్ పాయింట్లు

ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. అపరిమితమైన స్వేచ్ఛ, ఎక్కడికి వెళ్లాలి, ఏం తినాలి, ఎప్పుడు పడుకోవాలి అనేది పూర్తిగా మన ఇష్టం. జీవితంపై పూర్తి నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. బంధాల వల్ల వచ్చే ఒడిదుడుకులు, ఎమోషనల్ డిస్టర్బెన్స్ ఉండవు కాబట్టి, తమ లక్ష్యాలు, కెరీర్, ప్యాషన్ (రచనా వ్యాసంగాలు, కళలు, వ్యాపారం వంటివి)పై వంద శాతం శ్రద్ధ పెట్టవచ్చు. మనం సంపాదించిన డబ్బును మనకు నచ్చినట్లు ఖర్చు పెట్టుకోవచ్చు లేదా దాచుకోవచ్చు. కుటుంబ బడ్జెట్ వత్తిడులు, ఖర్చుల లెక్కలు ఉండవు. బంధాల్లో సహజంగా వచ్చే అపార్థాలు, గొడవలు, ఎక్స్‌పెక్టేషన్స్ (అంచనాలు) వంటివి లేకపోవడం వల్ల మైండ్ చాలా ప్రశాంతంగా ఉంటుంది.

## నాణేనికి మరో వైపు..

**సోలో బతుకులో సవాళ్లు:** స్వేచ్ఛ బాగున్నప్పటికీ, జీవితంలో ఏదో వెలితిగా అనిపిస్తుంది. మన సంతోషాన్ని పంచుకోవడానికైనా, బాధను ఓదార్చడానికైనా "ఒక తోడు ఉంటే బాగుణ్ణు.." అనే భావన రావడం సహజం. ఒంట్లో బాగోనప్పుడు మంచి నీళ్లు ఇచ్చేందుకు, లేదా హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు నమ్మకమైన తోడు లేకపోవడం సోలో లైఫ్‌లో పెద్ద మైనస్. వయసు పెరుగుతున్నకొద్దీ, స్నేహితులందరూ వారి వారి కుటుంబాలతో బిజీ అయిపోతారు. ఆ సమయంలో "రేపు నాకేంటి?" అనే అభద్రతా భావం వచ్చే అవకాశం ఉంది.

"మరొకరితో ఉంటూ రోజు గొడవపడే కంటే.. ఒంటరిగా ఉంటూ మనశ్శాంతిగా బతకడం వంద రెట్లు మేలు".

ఈ సూత్రం ప్రకారమే చాలామంది సోలో లైఫ్‌ను ఎంచుకుంటున్నారు. అయితే, సోలో బతుకు అనేది ఎవరి వ్యక్తిగత ఇష్టం వారిది. కొంతమందికి ఒంటరితనం శాంతిని ఇస్తే, మరికొంత మందికి బంధాలు భద్రతను ఇస్తాయి. జీవితంలో ఏది ఎంచుకున్నా "మనశ్శాంతి ఎక్కడ దొరికితే అదే సరైన మార్గం!"

నేటి తరం యువత తమ కాళ్లపై తాము నిలబడటాన్ని, నచ్చినట్లు జీవించడాన్నే అతిపెద్ద విజయంగా భావిస్తున్నారు. వారి దృష్టిలో పెళ్లి అనేది జీవితంలో 'తప్పనిసరి' కాదు, కేవలం ఒక ఆప్షన్ మాత్రమే!

మారుతున్న కాలంతో పాటు పెళ్లి వయసు పెరగడం అనేది వ్యక్తిగత స్వేచ్ఛకు, ఆర్థిక ఎదుగుదలకు చిహ్నం. అయితే, అటు కెరీర్‌ను, ఇటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సమన్వయం చేసుకుంటూ.. మరీ ఆలస్యం కాకుండా 'సరైన వయసు' లో నిర్ణయం తీసుకోవడమే జీవిత సమతుల్యతకు మంచి మార్గం.

– ఆనంద'మైత్రేయ'మ్

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
**sunmagvaartha@gmail.com**

# వన భోజనం

చిట్టి ఏడో తరగతి చదువుతోంది చురుకైన, తెలివైన పాప. కార్తిక మాసంలో ఓ రోజు చిట్టి, వాళ్ళ కుటుంబ సభ్యులతో కలిసి, వనభోజనాలకు వెళ్ళింది. “బాబాయ్, వన భోజనాలంటే ఏంటి?” అనడిగింది చిట్టి.

“వనములో అదేనమ్మా.. అడవిలో కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం చిట్టి” అని చెప్పాడు బాబాయ్. “అడవిలోనే ఎందుకు భోజనం చేయాలి” మళ్లీ అడిగింది చిట్టి.

“కార్తిక మాసంలో అడవుల్లో పచ్చని చెట్ల మధ్య ప్రశాంతంగా ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణంలో అదే వనములో భోజనాలు చేయడం అందరికీ చాలా ఆనందంగా ఉంటుంది. ఓ రోజు కుటుంబ సభ్యులందరూ కలిసి, భోజనం చేయడం ఒక మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది. వన భోజనాలు పూర్వకాలం నుండి చేస్తున్నారు. ఐకమత్యం గొప్పతనం చాటడమే వనభోజనాల్లో ఉన్న అర్థం, పరమార్థమని చెప్పుకోవచ్చు” అని చెప్పాడు బాబాయ్.



“పిల్లలూ, ఇదిగో సీతాఫలాలు తినండర్రా! గింజలు మాత్రం పని అనుకోకుండా కాస్త అక్కడక్కడ చల్లండి. నేనే చల్లుదాము.. అనుకున్నాను కానీ, నా మోకాళ్ల చాలా నొప్పిగా ఉన్నాయర్రా నడవలేక పోతున్నాను” అని అంది బామ్మ.

“ఈ అడవిలో సీతాఫలం గింజలు వేయడం ఎందుకు బామ్మా” అని చిట్టి అంది.

“సీతాఫలం గింజలు ఎక్కడైనా మొలకెత్తుతాయి” అంది బామ్మ. “అడవిలో ఆ మొక్కలకి నీళ్లు ఎవరు పోస్తారు?” కళ్ళు పెద్దవి చేసి చిట్టి మళ్ళీ అడిగింది. “చిట్టితల్లీ సీతాఫలం మొక్కలకు ఎవరూ నీళ్లు పోయాల్సిన అవసరం లేదు. వాటంతట అవే పెరుగుతాయి. వాటికి వాననీళ్లే సరిపోతాయి” అంది బామ్మ. “మరి ఈ అడవుల్లో సీతాఫలాలు ఎవరు తింటారు?” ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది చిట్టి.

“అడవిలో పక్షులు తినడానికి ఉపయోగపడతాయి కదా! పక్షులు పండ్లను తిని, అక్కడక్కడ గింజలు పడేస్తే అడవిలోనూ సీతాఫలం చెట్లు చక్కగా పెరుగుతాయనే నా ఆత్రం” అని బోసి నోటితో నవ్వింది బామ్మ.

“బామ్మ మాట బంగారు మాట” అంటూ పిల్లలందరూ సీతాఫలాలు తిని, గింజలను చక్కగా జల్లారు.

“భోజనాలకు రండర్రా” అని చిట్టి వాళ్ళమ్మ పిలిచింది. “తెల్లగా పొడవుగా ఉంది ఏమిటిది? మామయ్యా” అని అడిగింది చిట్టి.

“దాన్ని పాము కూసం అదే సైన్స్ పరిభాషలో నిర్మోచణం అంటారు అదే చిట్టి పాము తన మలిన చర్మాన్ని వీడటం(వదలడం) అన్నమాట” అని మామయ్య వివరంగా చెప్పాడు.


“అమ్మో! ఇక్కడ పాములు ఉంటాయా” అని పిల్లలు భయపడ్డారు. “వాటిని మనం ఏమి చేయకపోతే అవి మనల్ని ఏమీ చేయవు” అని ధైర్యం చెప్పాడు మామయ్య.

“అయినా పాము నన్ను కరవనే కరవదు, మొన్ననే నాగుల చవితినాడు పుట్టలో పాలు పోసి, గుడ్డు వేసి నాగరాజా! నన్ను ఎప్పుడు కరవకని మొక్కుకున్నాను” అని చిట్టి అంది.

– **అమ్మిన వెంకట అమ్మిరాజు**, పేరూరు







## బాలగేయం



### నవ్వులు-పువ్వులు

పసిపాపల నవ్వులు
పసిడి బుగ్గల ఎరుపులు
పొట్టి తెల్ల గౌనులో
విరబూసిన మల్లెలు!
పసిపాప అడుగులు
రాజహంస నడకలు
బాపూజీ బోసి నవ్వులు
సొట్టలు పడిన బుగ్గలు!
తోటి పిల్లలతో ఆటలు
లేడి పిల్ల గంతులు
బుల్లి పాప మాటలు
బంగారు మూటలు!
చిట్టితల్లి ఆకలి అరుపులు
అమ్మచేతి గోరుముద్దలు
బొజ్జ నిండితే చాలు
ఊయలలో ఊగు పాపాయి.

– పేరూరు బాలసుబ్రమణ్యం

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

బి.భావేశ్, నాందేడ్

**ప్రశ్న: తుమ్మడం అశుభమా?**

**జవాబు:** ఇలా అనేవారికి శ్వాస పీల్చడమే అశుభం. మన దేశంలోనే కాదు.. వివిధ దేశాలలో ఈ మూఢనమ్మకం ఉంది. తుమ్ము రాని మనుషులంటూ ఎవరూ ఉండరు. తుమ్మడం అన్నది శరీర ధర్మాల్లో ఒకటి. ముక్కులోని మ్యూకస్ తుమ్మును ప్రేరేపిస్తుంది. మ్యూకస్‌కు ఏ విధమైన దురద కలిగినా, కొన్ని వెగటు వాసనలు, ఘాటైన పదార్థాల వాసనలు వచ్చినా మ్యూకస్ ప్రభావితమై తుమ్మడం జరుగుతుంది. జలుబు వల్ల, ఎలర్జీ వల్ల కూడా తుమ్ములు వస్తాయి. తుమ్మడమన్నది శరీర సహజ క్రియేగానీ, దానివల్ల అశుభమన్నది ఉండదు. ముక్కులో ఏమైనా దుమ్ము, ధూళీ వున్నా, మలినాలు వున్నా తుమ్ముతో పాటు వెలుపలికి వచ్చి ముక్కు శుభ్రపడుతుంది. తుమ్ము, తుమ్మడం మీద అన్ని దేశాలలో కంటే మన దేశంలోనే వివిధ ఆచారాలు, మూఢ విశ్వాసాలూ అనేకం వున్నాయి. తుమ్ముకు అదృష్ట దురదృష్టాలను ముడి వేసారు. శుభ శుభాలనూ లంకె వేసారు. అయితే తుమ్ము వస్తున్నప్పుడు బలవంతంగా ఆపుకోకూడదు.

కె.వసుధ, విజయవాడ

**ప్రశ్న: వాతావరణంలోని నీటిఆవిరి భూమి మీదకు ఎలా చేరుతుంది?**

**జవాబు:** వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని ఆర్ద్రత అంటారు. నీరు ఆవిరిగా మారి, నీటి ఆవిరి అవుతుంది. ఈ నీటి ఆవిరి నీరు లేదా మంచుగా మారటాన్ని ద్రవీభవనమని అంటారు. నీటి తుంపరల పరిమాణం, బరువు పెరిగినప్పుడు గాలికి ఈ తుంపరలను భరించే శక్తి లేక తేమరూపంలో భూమి మీద పడటాన్ని అవనిపాతం అంటారు. అవపాతం, వర్షం, మంచు, పొగమంచు లేదా వడగళ్ల రూపంలో ఉంటుంది. మేఘాల నుంచి పెద్ద పెద్ద చుక్కలుగా పడటాన్ని వర్షం అంటారు. దీనిని వర్షమాపకంతో కొలుస్తారు.





# సాహిత్యానికి తీరని లోటు

తెలుగు సాహిత్య ప్రపంచంలో తన ప్రత్యేకమైన రచనా శైలితో చిరస్థాయిగా నిలిచిన ప్రముఖ రచయిత్రి శారదా అశోకవర్ధన్ మరణం తెలుగు పాఠక లోకాన్ని విషాదంలో ముంచింది. ఆమె మరణంతో తెలుగు సాహిత్యంలో ఒక వెలుగు దీపం ఆరిపోయిందని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు.

శారదా అశోకవర్ధన్ తెలుగు భాషకు చేసిన సేవలు అపారమైనవి. నవలలు, కథలు, కవితలు, వ్యాసాలు, బాలసాహిత్యం, నాటకాలు, పాటలు.. ఇలా అనేక ప్రక్రియల్లో ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. మొత్తం 80కి పైగా గ్రంథాలను రచించి తెలుగు సాహిత్యానికి గొప్ప సంపదను అందించారు. ఆమె రచనల్లో మానవీయ విలువలు, కుటుంబ బంధాలు, స్త్రీ మనసు, సంస్కృతి ప్రతిబింబిస్తాయి.

ఆమె రచనల్లో సరళమైన భాష, హృదయాన్ని హత్తుకునే భావ వ్యక్తీకరణ ప్రత్యేకత. సామాన్య పాఠకుడికి కూడా అర్థమయ్యే విధంగా రాసిన ఆమె కథలు అనేక కుటుంబాల్లో చర్చనీయాంశమ య్యాయి. ముఖ్యంగా మహిళా జీవితాలపై ఆమె రాసిన కథనాలు ఎంతో ఆదరణ పొందాయి.

శారదా అశోకవర్ధన్ రచయిత్రిగానే కాకుండా ఆకాశవాణి దూరదర్శన్‌లలో కూడా తనదైన ముద్ర కనపరిచి ప్రసిద్ధులయ్యారు. ఆమె గళం ఎన్నో తెలుగు కుటుంబాలకు సుపరిచితం. సాహిత్యంతో పాటు సంగీతంపై కూడా ఆమెకు మంచి పట్టు ఉండేది.

'మనసాయేరా మాధవా' వంటి ఆమె రచించిన గీతాలు ప్రజాదరణ పొందాయి.

ప్రముఖ గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆలపించిన 'గణపతి సుప్రభాతం' భక్తుల మనసుల్లో నిలిచిపోయింది.

సికిందరాబాద్‌లో పుట్టి పెరిగి, ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడించి తన 88వ యేట మే 14న తన కుమార్తె అరుణ ఇంట్లో తుది శ్వాస విడిచి తెలుగు సాహితీ రంగాన్ని దుఃఖ సాగరంలో ముంచారు.

ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. రాష్ట్ర ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖలో చేరి జాయింట్ డైరెక్టర్‌గా ఎదిగారు. ఈమె రచించని ప్రక్రియ అంటూ ఏదీ లేదని చెప్పాలి. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఈమె రాసిన అనేక




శారదా అశోకవర్ధన్

నాటకాలు ప్రసారం అయ్యాయి. మొత్తం 14 నవలలు, 4 కథా సంపుటాలు, బాల సాహిత్యానికి సంబంధించి ఎన్నో వ్యాసాలు రాశారు. కొన్ని లలిత గీతాలు రచించారు.

రేడియోలో కుటుంబ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు కొన్ని రూపొందించారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'మరమరాలు' కాలమ్ నిర్వహించారు. ఆమె రచించిన 'గణపతి సుప్రభాతం' పద్యాలు మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడగా రికార్డులుగా రావడం ఓ విశేషం. తెలుగుదేశం పార్టీ మహానాడు సభల సందర్భంగా ఎన్.టి.రామారావుపై ఈమె రచించిన బుర్రకథ ఎంతగానో అలరించింది.

భానుమతి చిత్రం 'ధృవ మార్కండేయ' (1982)లో ఒక జోలపాట రాసి తొలి తెలుగు సినీ గీత రచయిత్రిగా చరిత్రకెక్కారు.

దూరదర్శన్ కోసం రూపొందించిన 'స్త్రీ' సీరియల్ ఎందరో వీక్షకులను ఆకట్టుకుంది. జంట నగరాల్లో ఒకటైన సికిందరాబాద్ చరిత్రను గ్రంథస్థం చేసి వెలువరించారు. తన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా రాసిన 'అశ్రుతర్పణ' నవల ఎంతో పేరు తెచ్చుకుంది.



శారదా అశోక్ వర్ధన్ రాసిన నవలలు దేనికదే ప్రత్యేకం. ఒక్కో నవల ఒక్కో ఇతివృత్తంతో ఉంటుంది. ఆడా మగా అని కాకుండా అందరూ మనుషులే అన్న దృక్పథం వీరిది. ఎప్పుడూ ఏ విధంగా కూడా పక్షపాతం చూపలేదు. నవలలు, కథలు పాజిటివ్ నోట్‌తోనే ముగించేవారు.

ఈమె సాహితీ కృషికి నిదర్శనంగా పలు పురస్కారాలు అందుకున్నారు. టీవీ విభాగంలో తన 'స్త్రీ' సీరియల్‌కి నంది అవార్డు రావడం మరో గొప్ప విశేషం. శారదా అశోక్ వర్ధన్ పేరు తెలియని అలనాటి పాఠకులు, శ్రోతలు ఉండరు. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉండేవారు.

ఈమె జీవితం సికిందరాబాద్‌లోనే ఆరంభమై సికిందరాబాద్‌లోనే ముగిసింది. ఈమె పుట్టింటివారు విజయనగరంకి చెందినవారు. ఇంతటి ప్రతిభ గల, ఇంతగా పేరు తెచ్చుకున్న శారదా అశోక్ వర్ధన్ మరణం సాహితీ రంగంలో తీరని లోటు. అశ్రుతప్త నయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తూ..

– గాదె లక్ష్మీ నరసింహ స్వామి (నాని)

# ఎఐ వెలుగుల్లో చిన్నారుల భవితవ్యం

నేటి ప్రపంచం వేగంగా మారుతోంది. ఒకప్పుడు మనిషి ఊహించిన విషయాలు ఇప్పుడు నిజ జీవితంలో కనిపిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు (AI), రోబోటిక్స్, వర్చువల్ ప్రపంచాలు, డిజిటల్ సాంకేతికతలు మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం ప్రతి ఒక్కరిపై ఉన్నప్పటికీ, అత్యంత ఎక్కువగా ప్రభావితమవుతున్నది చిన్నారుల ప్రపంచమే. ఎందుకంటే నేటి పిల్లలే రేపటి ప్రపంచాన్ని నిర్మించబోతున్నారు.

ఒకప్పుడు బాల్యం అంటే మట్టి వాసన, చెట్ల నీడ, పల్లె ఆటలు, అమ్మమ్మ కథలు. కానీ ఇప్పుడు బాల్యం స్క్రీన్‌ల మధ్య పెరుగుతోంది. బొమ్మల స్థానంలో గాడ్జెట్‌లు వచ్చాయి. స్నేహితులతో బయట ఆడుకోవడం తగ్గిపోగా, వర్చువల్ గేమ్‌లు పెరిగాయి. ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఇప్పుడు పుస్తకం మాత్రమే కాదు; AI కూడా. పిల్లల ఆలోచనా ప్రపంచం నెమ్మదిగా డిజిటల్ దిశగా మారుతోంది.




2050 నాటికి ప్రపంచ జనాభా 9 బిలియన్లకు చేరుకుంటుందని అంచనాలు చెబుతున్నాయి. పెరుగుతున్న జనాభాతో పాటు ఆహార అవసరాలు కూడా భారీగా పెరగనున్నాయి. వాతావరణ మార్పులు, నీటి కొరత, ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని కొత్త సవాళ్ల ముందుంచనున్నాయి. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తు తరాలు పూర్తిగా భిన్నమైన జీవనశైలిని అనుభవించే అవకాశం ఉంది.

ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ ఆహార వనరులపై పరిశోధనలు చేస్తున్నారు. ల్యాబ్‌లలో తయారయ్యే మాంసం, ఆల్గీ ఆధారిత ఆహారం, కీటకాల ప్రోటీన్లు వంటి అంశాలు రేపటి ఆహార వ్యవస్థలో భాగమయ్యే అవకాశముంది. మనం ఇప్పుడు ఆశ్చర్యంగా చూస్తున్న విషయాలు, భవిష్యత్తు చిన్నారులకు సాధారణ జీవనశైలిగా మారవచ్చు.

విద్యా రంగంలో కూడా AI విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని అర్థం చేసుకుని పాఠాలు చెప్పే AI టీచర్లు రావచ్చు. ప్రపంచ స్థాయి విద్య గ్రామీణ ప్రాంతాల పిల్లలకూ అందుబాటులోకి రావచ్చు. భాషా అవరోధాలు తగ్గిపోవచ్చు. వ్యక్తిగత అభ్యాస విధానాలు విద్యను మరింత సులభతరం చేయవచ్చు.

వైద్యరంగంలో కూడా అద్భుతమైన మార్పులు కనిపించవచ్చు. భవిష్యత్తులో వ్యాధి రాకముందే గుర్తించే సాంకేతికత అభివృద్ధి చెందవచ్చు. ప్రతి వ్యక్తి శరీర పరిస్థితికి అనుగుణంగా పనిచేసే మందులు అందుబాటులోకి రావచ్చు. ఎఐ ఆధారిత వైద్య సేవలు చిన్నారుల ఆరోగ్యాన్ని మరింత సురక్షితంగా మార్చే అవకాశం ఉంది. అయితే ఈ అభివృద్ధి వెనుక కొన్ని ఆందోళనకరమైన మార్పులు కూడా కనిపిస్తున్నాయి.

పిల్లలు ప్రకృతికి, కుటుంబానికి, మానవ సంబంధాలకు దూరమవుతున్నారు. సంభాషణలు తగ్గుతున్నాయి. నవ్వులు ఎమోజీల్లో పరిమితమవుతున్నాయి. స్నేహాలు స్క్రీన్‌లకే పరిమితమవుతున్నాయి. ఒంటరితనం నిశ్శబ్దంగా పిల్లల మనసుల్లో స్థానం సంపాదిస్తోంది.

భవిష్యత్తులో అనేక ఉద్యోగాలు యంత్రాల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. అందుకే రేపటి పిల్లలకు కేవలం మార్కులు సాధించడం సరిపోదు. సృజనాత్మకత, భావోద్వేగ నైపుణ్యాలు, మానవీయ విలువలు, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి లక్షణాలు మరింత అవసరమవుతాయి. ఎందుకంటే AI తెలివిని ఇవ్వగలదు కానీ మానవత్వాన్ని ఇవ్వలేదు.

మరోవైపు ప్రపంచ ఆర్థిక అసమానత కూడా పెరుగుతోంది.

సాంకేతిక వనరులు ఉన్న దేశాలు మరింత అభివృద్ధి చెందుతుండగా, పేద దేశాలు వెనుకబడే ప్రమాదం ఉంది. ఈ అసమానత భవిష్యత్తు చిన్నారుల అవకాశాలపై కూడా ప్రభావం చూపవచ్చు. ఒక వర్గం పిల్లలు అత్యాధునిక ప్రపంచంలో పెరుగుతుంటే, మరొక వర్గం ఇంకా ప్రాథమిక అవసరాల కోసం పోరాడాల్సి రావచ్చు.

అందుకే భవిష్యత్తు గురించి మాట్లాడేటప్పుడు కేవలం సాంకేతిక అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా, మానవీయ విలువల గురించి కూడా ఆలోచించాలి. పిల్లలకు AI వినియోగం నేర్పడం అవసరమే. కానీ అదే సమయంలో ప్రకృతిని ప్రేమించడం, సంబంధాలను కాపాడుకోవడం, బాధను అర్థం చేసుకోవడం, మనిషిగా జీవించడం కూడా నేర్పాలి. ఎందుకంటే రేపటి ప్రపంచాన్ని మార్చేది కేవలం కృత్రిమ మేధస్సు కాదు; మానవ హృదయం కూడా.

– డా॥ కృష్ణకుమార్ వేపకొమ్మ

కథ

# విఘ్నమాయ

బొమ్మిరెడ్డి ప్రమీలరవి

షూ లేస్ కట్టుకుని లేచి నిలబడి "నేను వెళ్తున్నా" అంటూ టిఫిన్ బాక్స్ చేతిలోకి తీసుకున్నా. "బావా.. ప్లీజ్ వెళ్తూ వెళ్తూ దారిలో ఈ జాకెట్ పీస్, ఆది జాకెట్ టైలర్ షకీల్ ఇచ్చి వెళ్ళవా.. ఆల్రెడీ వాడికి కాల్ చేశాను. మధ్యాహ్నానికి కుట్టి వాళ్ల కుర్రోడుతో పంపిస్తాను అన్నాడు. సాయంత్రం మా లేడీస్ క్లబ్ మీటింగ్ కదా. మరేమో నన్నే సెక్రెటరీ చేస్తారేమో" అంటూ హొయలు పోతున్న అవంతిని మాటలు వింటుంటే కోపం వచ్చింది నాకు. అనుకుంటూ టైం చూసుకున్నాను.

పావు తక్కువ పది. తిన్నగా ఆఫీసుకి వెళ్తే పది నిమిషాలు. అంటే ఐదు నిమిషాల ముందరే ఆఫీసు చేరుకుంటా. ఆఫీసుకు ఐదు, పది నిమిషాల ముందరే చేరుకోవడం నా రికార్డు. నా ఈ ఐదు ఏళ్ల రెండు నెలల సర్వీసులో ఒక్క నిమిషం కూడా లేటు వెళ్ళలేదు.

ఇప్పుడు మెయిన్ బజారుకి వెళ్ళి టైలర్‌కి ఇచ్చి ఆఫీసుకి వెళ్తే పది నిమిషాలు లేటు.

"కుదరదు ఆఫీసు టైమ్ అయిపోతోంది" అన్నా.

"మీ ఆఫీసు గురించి నాకు చెప్తారా..మీ కొలీగ్స్‌లో ఎవరైనా పది గంటలకు ఆఫీసుకి వస్తున్నారా ఒక్క మూర్తి గారు తప్పా. మీ ఆఫీసరు లింగం గారు ఎప్పుడైనా పన్నెండు గంటల ముందు ఆఫీసుకి వచ్చాడా? ఫస్ట్ టైలర్ షాప్‌కి వెళ్లే ఆఫీసుకు వెళ్లండి" అంటూ హుంకరించింది.

రెండేళ్ల మా పాప భయంతో చూస్తుంటే చేసేది లేక టైలర్ షాప్‌కి బయలుదేరాను. ఫాస్ట్‌గా డ్రైవ్ చేసినా మెయిన్ బజార్‌లో ట్రాఫిక్‌తో ఆఫీసుకి చేరి స్కూటర్ పార్క్ చేస్తూ టైం చూస్తే పది గంటల ఆరు నిమిషాలు.

అప్పుడే ఆఫీసు మెట్లు దిగుతూ చేతిలో టీ తీసుకురావడం కోసం ఫ్లాస్క్‌తో రహీం నన్ను చూస్తూ "ఇవాళ రెండు అద్భుతాలు సారు.. ఎప్పుడూ ఐదు నిమిషాల ముందరే వచ్చే మీరు లేటు రావడం; ఎప్పుడూ పన్నెండు గంటలకి ముందు రాని మన పెద్ద బాసు గారు ఈరోజు పొద్దున్నే 9 గంటలకే రావడం" అన్నాడు.

"ఏంటీ..బాసు అప్పుడే వచ్చాడా?"

"ఆయన రావడమే కాదు మీ గురించి అడుగుతున్నారు. ఆయన కూడా ఎవరో హెడ్ ఆఫీసు నుంచి వచ్చిన ఆఫీసరు గారు వున్నారు. వెంటనే క్యాబిన్‌లోకి వెళ్ళండి" అంటూ టీ కోసం వెళ్ళిపోయాడు.

నేను కంగారుగా నా సీటుకి వెళ్ళి టిఫిన్ బాక్స్ డ్రాలో పడేసి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని బాసు చాంబర్ వైపు అడుగులేసాను.. భయం భయంగా.

కేబిన్ స్వింగ్ డోరు తీసి లోపలకి తొంగి చూసా. బాసు ఎదురుగా అంత ఎండలోనూ ఒక సూట్‌వాలా బట్టతలతో కనపడ్డారు.

తలుపు చప్పుడుకి బాసు నన్ను చూస్తూ "రా..రావోయి" అంటూ పిలిచాడు.

లోపలకి వచ్చిన నాకు బాసు టేబుల్ మీద తెల్ల కవర్ కనిపించింది. మళ్ళీ కంగారు పడిపోయా. కొంపతీసి లేటుగా వచ్చినందుకు మెమో కాదు కదా! మా బాసు కాలాంతకుడు. ఆ ఆఫీసరు ముందు పోజు కోసం నాకో మెమో ఇచ్చి ఇంక ఎప్పుడూ లేట్ రావద్దని వార్నింగ్ ఇచ్చి మార్కులు కొట్టేస్తాడేమో!

"ఈయన పేరు బెనర్జీ. మన హెడాఫీసులో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్. పొద్దున్నే మన ఆఫీసు మెయింటైన్సు తనిఖీ చేయడానికి వచ్చారు.

ఆయన నీకో లెటర్ తెచ్చారు. తీసుకో" అని ఆయన వైపు చూశాడు. ఆరు నిమిషాలు లేటుకి ఇంత పెద్ద శిక్షా. అది కూడా సర్వీసులో ఫస్ట్ టైమ్. అవంతి మీద చచ్చేంత కోపం వచ్చింది. మేనరికం బదులు బయట



సంబంధం చేసుకుంటే తనే డామినేట్ చేసేవాడు. ఇప్పుడు ఈ సంకటం వచ్చేది కాదు.

బెనర్జీ గారు లేచి నా చేతిలో ఆ కవర్ పెట్టి "కంగ్రాట్స్" అంటూ ఏక్‌హ్యాండ్ చేసాడు. ఉక్కిరిబిక్కిరి అయి ఏమై ఉంటుంది? హైద్రాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అయి ఉంటుంది. నేను భీమవరం వచ్చినప్పటి నుంచి ప్రయత్నం చేసేది అదేగా. అనవసరంగా అవంతిని తిట్టుకున్నానే!" అనుకుంటూ కవర్ ఓపెన్ చేసి చూసా.

ఒక్కసారి కళ్ళు బైర్లు కమ్మాయి. అది ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కాదు. నాకు ఆఫీసరుగా ప్రమోషన్.

"కింద చూడు" అన్నాడు బాసు. అప్పుడు చూసా. ప్రమోషన్‌తో పాటు హైద్రాబాద్‌లో హెడాఫీసులో లోన్ సెక్షన్‌కి ఇంచార్జిగా. నాకు నమ్మకం కలగటం లేదు. ఎందుకంటే నా ఐదు సంవత్సరాల సర్వీసుకి అప్పుడే ప్రమోషన్ ఇవ్వరు. సీనియారిటీకి, సామర్థ్యానికి ప్రిఫరెన్సు ఇస్తారు. మరి నాకు ఎలా వచ్చిందో!?

నా వైపు చూస్తూ మా బాసు "నువ్వు నీ సీట్లో పది నిమిషాలు వెయిట్ చేయి. టీ తాగిన తర్వాత నా కార్లో నన్ను మా ఐరన్ షాపులో దించి ఈ సారుని రైల్వే స్టేషన్‌లో వైజాగ్ రైలు ఎక్కించి రా" అని ఆర్డరేసాడు.

ఆనంద డోలికల్లో మెల్లిగా డోర్ తీసుకుని నా సీటు వైపు అడుగులేస్తూ ఒకసారి ఆఫీసు హాల్ మొత్తం కలయ చూసా. షరా మామూలే.

ఎవరూ సీట్లో లేరు ఒక్క రమణమూర్తి తప్పా. కరెంట్ పోయినా కాండిల్ వెలుగులో పనిలో మునిగిపోయాడు మూర్తి. ఒక్కసారి నా మనసులో భయంకరమైన అనుమానం వచ్చింది. నిజానికి ఈ సంవత్సరం వున్న ఒకే ఆఫీసరు వేకెన్సీకి ఎలిజిబుల్ రమణమూర్తి ఒక్కడే! మరి నాకు ఎలా వచ్చింది? అంతకు ముందు ఉన్న ఆనందం ఒక్కసారి మాయమైంది.

రమణమూర్తి నోట్లో ముద్ద నేను లాక్కుంటున్నానా? మా కార్పొరేషన్ రూల్స్ ప్రకారం ప్రతి ఏడాది ఎన్ని ప్రమోషన్స్ ఇవ్వాలని బిజినెస్ లెవెల్స్ బట్టి నిర్ణయిస్తారు. మా ఆఫీసులో పని చేసేది మూర్తి. మిగిలిన వాళ్ళలో ఎవరికీ పని మీద కాని ప్రమోషన్ మీద కాని ఇంట్రస్ట్ లేదు. నెలాఖరుకి జీతాల వచ్చాయా లేదా.. అంతే. ఈసారి ప్రమోషన్ ప్యానెల్ లిస్ట్‌లో అతనొక్కడే ఎలిజిబుల్. మరి ఇలా ఎలా జరిగిందో అర్థం కావడం లేదు.

ప్రశ్నలు నా మెదడును తొలిచేస్తున్నాయి. ఇంతలో బాసు, ఆయనతో పాటు బెనర్జీ గారు కేబిన్ నుంచి బయటకు వస్తూ "సారుని ట్రైన్ ఎక్కించి రా!" అంటూ బయల్దేరారు. బెనర్జీని ట్రైన్ ఎక్కించి బాసు గారికి కారు పంపించేసా. రైల్వే స్టేషన్‌లో ఒక మూల కూర్చుని ఆలోచనలో పడ్డా. పదే పదే రమణమూర్తి అమాయక ముఖం గుర్తొస్తోంది. వరంగల్‌లో చాలా వెకెన్సీలు ఉన్నాయని, రమణమూర్తి కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు ఈసారి.

ఒక్కగానొక్క కొడుకుగా వృద్ధాప్యంలో తల్లితండ్రులను వాళ్ల అనారోగ్యాలను దగ్గరుండి చూసుకోవచ్చని ఆతృతతో ఆశగా ప్రమోషన్ కోసం వేచి చూస్తున్నాడు.

ప్రమోషన్ రాలేదని తెలిస్తే షాక్‌తో ఏమి అయిపోతాడో. ఇక లాభం లేదు ఈ విషయం తేలాలి రమణమూర్తికి ఎందుకు రాలేదో! అనుకుంటూ లేచి ఆఫీసుకి వెళ్ళే ఆలోచన మానుకుని ఇంటిదారి పట్టా. తలుపు తీసి నన్ను చూసి అవంతి "అప్పుడే వచ్చేశావ్! వొంట్లో బాగా లేదా" అంటూ ప్రశ్నించింది.

"నువ్వు ఎక్కడికి తయారవుతున్నావు?" అన్నా.

"ఇవాళ సాయంత్రం మా లేడీస్ క్లబ్ మీటింగ్ అని చెప్పానుగా. కొంచం ముందుగా వెళ్ళి ఏర్పాట్లు చూసుకోవాలి కదా. నువ్వు త్వరగా రావడం మంచిది అయ్యింది. పాప

**నా వైపు చూస్తూ మా బాసు "నువ్వు నీ సీట్లో పది నిమిషాలు వెయిట్ చేయి. టీ తాగిన తర్వాత నా కార్లో నన్ను మా ఐరన్ షాపులో దించి ఈ సారుని రైల్వే స్టేషన్‌లో వైజాగ్ రైలు ఎక్కించి రా" అని ఆర్డరేసాడు.**

డే కేర్ ఐదు గంటలకి ఇంటికి వస్తుంది థ్యాంక్ యూ.

మీటింగ్ ఏడు గంటలకి అయిపోతుంది. ప్లీజ్.. రోజీకి రాగానే పాలు పట్టవా" ఎంతో ఇంటరెస్ట్‌గా ఉన్న ఆమెతో ఏమీ చెప్పకూడదు అనుకుని "ఒకే వెళ్ళిరా" అని అభయ హస్తం ఇచ్చేశా. అవంతి వెళ్ళగానే తలుపు వేసి సోఫాలో కూలబడి ఆలోచనలో పడ్డా. రోజీ రాగానే పాలు పట్టి నేను టీ చేసుకుని తాగి అవంతి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నా. ఎనిమిది గంటలకి హడావిడిగా వచ్చిన అవంతి రోజీని దగ్గర తీసుకుంటూ "అల్లరి చేయలేదు కదా" అంది. ఆమె వెనుకే ఆటోవాడు ఒక దొంతర శాలువాలు, పూలదండలు సోఫా మీద పెట్టి వెళ్ళిపోయాడు. విస్మయంగా వాటిని చూస్తున్న నా కేసి గర్వంగా చూస్తూ "మా క్లబ్ సెక్రెటరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. మూడేళ్లపాటు ఈ భీమవరాన్ని ఏలేస్తా" అంది.

నిన్నటి వరకు భీమవరం బోర్.. ఎప్పుడు హైద్రాబాద్ పోదామా అని ఎదురు చూసే అవంతి.

రోజీకి తినిపించి నాకు తినబుద్ధి కాక అలా సోఫాలో కూర్చొని అవంతి కోసం వెయిట్ చేస్తుంటే– అవంతి హాల్లోకి వచ్చి "అదేంటి? నువ్వు డిన్నర్ తినలేదా! తిని తొందరగా పడుకుందాము.. బాగా అలిసిపోయా" అంటూ రోజీని ఎత్తుకుని బెడ్రూమ్ వైపు వెళ్లిపోయింది అవంతి.

"అవంతీ, నేను రాత్రికి హైద్రాబాద్ వెళ్ళాలి, ఆఫీసు పని మీద. మళ్లీ ఎల్లుండి పొద్దున్నే వచ్చేస్తా" "నీది

క్యాంపుల జాబ్ కాదు కదా!" అంది. "బాస్ ఆర్డర్" అన్నాను.

"నువ్వు వెళ్ళేటప్పుడు లేపితే తలుపులు వేసుకుంటా!" అనుకుంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది. హైదరాబాద్ అనగానే వెంటనే బయలుదేరేది.. ఇప్పుడు అసలు పట్టించుకోవడం లేదు" అనుకుంటూ స్టేషన్‌కి బయలుదేరాను. మా హెడ్ ఆఫీసు దగ్గర్లో బృందావన్ హోటల్‌లో రూమ్ తీసుకుని కొంచెంసేపు పడుకుని కార్యాచరణ ఆలోచించా. బ్రేక్ ఫాస్ట్ చేసి, హెడ్ ఆఫీసు చేరుకున్నా. మెల్లిగా ఆఫీసు కలియచూస్తూ అడుగులో అడుగులు వేస్తూ తెలిసినవాళ్ళు ఎవరైనా కనపడతారేమో అని చూస్తున్నా. ఇంతలో ఒక ఛాంబర్ డోర్ మీద ఎస్ పాండురంగారావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అని కనిపించింది. ఒక్కసారి రిలీఫ్ అయిపోయాను. పాండు రంగారావు దగ్గరే నేను మూడు నెలలు ట్రైనింగ్‌లో పని చేశా. "నేను స్టాఫ్‌ను, పాండురంగారావు సార్‌ని కలవాలి" అన్నాను.

"సారు జనరల్ మేనేజర్ గారి ఛాంబర్‌లో ఉంటారు రండి" అంటూ ఆఖరి ఛాంబర్‌లోకి తీసుకువెళ్ళి–

"మీకు సారు తెలుసుగా! లోపలికి వెళ్ళండి" అని డోర్ తెరిచాడు. తలుపు చప్పుడుకి తల ఎత్తి చూసాడు పాండురంగారావు గారు.

నన్ను చూడగానే "హల్లో! కంగ్రాట్స్ యంగ్ ఏజ్‌లోనే ప్రమోషన్ కొట్టేశావు. స్వీట్‌లు ఏవీ? అంటూ ప్రేమగా పలకరించారు.

"ఒక్క నిమిషం టైమ్ ఇస్తారా" అన్నాను.

"అంత డల్‌గా ఉన్నావు ప్రమోషన్, హైద్రాబాద్‌కి ట్రాన్స్‌ఫరూ రెండూ వచ్చాయిగా" అన్నాడు.

"నా కంటే ఎంతో మంది సీనియర్స్ ఉండగా నాకు ప్రమోషన్ ఏమిటి? మీరే సాల్వ్ చేయాలి?" అంటూ వాపోతున్న నా భుజం మీద చేయి వేసి పాండురంగారావు గారు

"నిన్ను చూస్తుంటే ఒకపక్క జాలి, మరోపక్క గర్వంగా ఉంది.

నీ గొప్ప మనసు నిజంగా అభినందించాల్సిందే. నేను చెప్పకూడదు కానీ నీ సిన్సియారిటీ చూశాక అసలు విషయం చెప్పాలనిపిస్తోంది. చెప్తాను.. విను.

"మీ బాస్ లింగం గారు మన మొత్తం కార్పొరేషన్‌లోనే సీనియర్. ఇంకా రెండేళ్లలో రిటైర్ అవుతాడు. ఇప్పుడున్న మన జనరల్ మేనేజర్ మోహనరావు కూడా ఆయన దగ్గర పనిచేశాడు. అందుకే ఆయనకి మీ బాస్ లింగం అంటే భక్తి. లింగం గారు తలచుకుని అన్ని ప్రమోషన్‌లు తీసుకుని ఉంటే ఆయనే మనకు జనరల్ మేనేజర్ అయి ఉండేవారు. కానీ ఆయన ప్రాబ్లం ఫ్యామిలీ, ఆస్తుల గురించి.

ఆయన మామ గారికి మొత్తం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో చాలా ప్రాపర్టీస్ వున్నాయి. విలువ వంద కోట్లు పైనే ఉండొచ్చు. ఆయన ఉన్నంత కాలం ఆస్తి మొత్తం ముగ్గురు పిల్లలకి అనే ఉద్దేశం ఉండేది. పది సంవత్సరాల క్రితం ఆయన పోవడం, ఇద్దరు కొడుకులు కోడళ్ళు మాట మార్చి ఏదో కొంత ఇచ్చి లింగం గారిని వదిలించు కోవాలని ప్లాన్ వేశారు.

అందుకే తన ఒక్కాగానొక్క కూతురు నీ ఒక్క బామ్మర్ది కొడుక్కు ఇచ్చి పెళ్ళి చేస్తే ఇక గొడవ ఉండదని ఆయన ప్లాన్. లింగం గారి గురించి ఆయన డబ్బు ఆశ గురించి అందరికీ తెలుసు. అందుకే ఆయన బామ్మర్దులు ఎక్కడ ఆస్తులు తన్నుకుపోతారో అని తన పొజిషన్ కన్నా తక్కువ స్థాయిలో మామూలు మేనేజర్‌గా భీమవరం వదలకుండా ఉండిపోయాడు.

ఆయనకి మిఠాయి పొట్లంలా రమణమూర్తి దొరికాడు. ఇంకేం..! ఆఫీసు పని అంతా రమణమూర్తి మీద పడేసి తను వాళ్ల వ్యాపార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ తను కూడా వాటా దారే అని

**"మీకు సారు తెలుసుగా! లోపలికి వెళ్ళండి" అని డోర్ తెరిచాడు. తలుపు చప్పుడుకి తల ఎత్తి చూసాడు పాండురంగారావు గారు.**

ఆయన బామ్మర్దులకి తలకాయ నొప్పిగా తయారు అయ్యాడు.

ఇప్పుడు రమణమూర్తిని సపోర్ట్ చేసి ప్రమోషన్ ఇప్పిస్తే ఇంకేముంది తను ఆఫీసుకి బుక్ అయిపోతాడు. అందుకే రమణమూర్తికి మరో రెండేళ్ల వరకు తను రిటైర్ అయ్యే వరకు ప్రమోషన్ రానివ్వడు.

మరి ఈసారి ఎలిజిబుల్‌లో ఉన్న మరో కాండిడేట్ మహేష్ హైద్రాబాద్ వదిలి వెళ్ళడు. అందుకే అతను ప్రమోషన్ రిజెక్ట్ చేసాడు. రమణమూర్తికి మీ బాస్ లింగం గారు అడ్డం.

మరో కాండిడేట్ ఎవరా? అని ఆలోచించి ఆ బాధ్యత మీ లింగ గారికే వదిలేశాడు జనరల్ మేనేజర్ మోహనరావు.

తప్పనిసరిగా ఫస్ట్ టైమ్ చాలా జూనియర్ అయిన నిన్ను లింగం గారు రికమెండు చేయడం నీకు ప్రమోషన్ రావడం అయిపోయింది. అర్థం అయిందా సామీ" అని అసలు కథ సెలవిచ్చాడు.

నాకు ఒక ఐడియా తట్టింది మహేష్ లాగా నేను ప్రమోషన్ రిజెక్ట్ చేస్తే? అదే ఆయనతో చెప్పాను.

"బాగా ఆలోచించుకో! మళ్ళీ మూడేళ్ల వరకు నీకు ప్రమోషన్ రాదు" అన్నాడు పాండురంగారావు.

"నేను సిద్ధం సార్! రమణమూర్తికి ఈసారి ప్రమోషన్ వస్తే చాలు సర్" అన్నా... అవంతి కూడా భీమవరంలో మూడేళ్లకు ప్లాన్ చేసుకుంది కదా అనే ధైర్యంతో.

ఆయన హెచ్ఆర్‌నీ పిలిచి ఫార్మాలిటీస్ పూర్తి చేయించి నాకు ప్రమోషన్ రిజెక్షన్ ఆర్డర్,

రమణమూర్తికి ప్రమోషన్, వరంగల్‌కి ట్రాన్స్‌ఫర్ ఆర్డరు నా చేతిలో పెట్టి "నువ్వు లక్కీ.. జనరల్ మేనేజర్ మోహనరావు గారు లీవ్‌లో ఉండడం వల్ల పని ఈజీగా అయిపోయింది. గాడ్ సేవ్ యు" అంటూ షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

నేనేదో వరల్డ్ కప్ గెలిచినంత ఆనందంతో ఆ తెల్లటి కవర్‌ని సంతోషంగా హత్తుకుని జెట్ స్పీడ్‌తో హోటల్ ఖాళీ చేసి స్టేషన్‌కి బయల్దేరాను.

పొద్దున్నే ఆరు గంటలకి భీమవరం చేరాను. ఆటోలో ఇంటి ముందు దిగుతూ అప్పుడే మెయిన్ డోర్ తీసి ఉండడంతో అవంతి తెల్లారే లేచింది ఏమిటి?" అనుకుంటూ ఇంట్లోకి అడుగు పెట్టా.

"అరే అప్పుడే వచ్చేశావా? ఫ్రెష్ అయి రండి.. కాఫీ ఇస్తాను" అంది అవంతి.

"ఈ హడావిడి నీ కోసం కాదు. మొన్న నేను ఏకగ్రీవంగా సెక్రెటరీ కావడానికి కారణం అయిన మా క్లోజ్ ఫ్రెండ్స్ ఐదుగురిని మన ఇంటికి ఇవాళ భోజనానికి పిలిచా! నాకు కొత్త కదా! వచ్చే మూడు సంవత్సరాలు నాకు సపోర్ట్‌గా ఉంటారని" అంది.

హమ్మయ్య..! అవంతి పూర్తిగా భీమవరంలో మరో మూడేళ్లకి ఉండడానికి ప్రిపేర్ అయిపోయిందన్న మాట.

అయితే నేను చేసిన పని మంచిదే! అనుకున్నాను. పన్నెండు గంటలకి భోజనం చేసి ఈపాటికి బాస్ లింగం గారు వచ్చి ఉంటారనుకుంటూ స్కూటర్ కిక్ కొట్టబోతూ ఉంటే–

"బావా! మరచిపోయా. కాస్తా వీధి చివర బండిలో రెండు మూడు రకాల పండ్లు తీసుకు వచ్చి ఆఫీసుకి వెళ్ళు" అని మళ్ళీ హుకుం జారి చేసింది.

ఈసారి నాకు కోపం రాలేదు "ఒకే డియర్" అంటూ పండ్లు కొని ఇంట్లో ఇచ్చేసి ఆఫీసుకి బయలు దేరాను.

"బాసు గారు వచ్చారా? నువ్వు ఒక పని చేయి. స్టాఫ్ అందరికీ బజ్జీలు, స్వీట్, టీ పట్టుకురా" అని వాడి చేతిలో ఐదు వందల నోటు పెట్టా.

స్కూటర్ పార్క్ చేస్తుంటే రహీం "సారూ, మీరు అదే పంథా" అంటూ వాచ్ కేసి టైమ్ చూసుకున్నాడు.

"బాసు గారు వచ్చారా? నువ్వు ఒక పని చేయి. స్టాఫ్ అందరికీ బజ్జీలు, స్వీట్, టీ పట్టుకురా" అని వాడి చేతిలో ఐదు వందల నోటు పెట్టా.

వాడు నోరు తెరిచి నాకేసి చూస్తుండగానే నేను ఆఫీసు హాల్లో అడుగు పెట్టి అంతా కలియ చూశా.

అందరూ వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చుని ఉన్నారు. అదీ ఇంకో అరగంట మాత్రమే. తర్వాత లంచ్ బ్రేక్.. అంటూ వెళ్తారు.

నేను హాల్ మధ్యలో నిలబడి "ప్లీజ్.. అందరూ లేచి బాసు గారి ఛాంబర్‌లోకి రండి" అంటూ నేను కూడా బాసు ఛాంబర్ వైపు నడిచా.

నన్ను ఫాలో చేస్తూ అందరూ కలిసి బాసు ఛాంబర్‌లోకి చేరాము.

మూకుమ్మడిగా స్టాఫ్ అందరినీ చూసి కొంచం కంగారుగా "ఏమిటీ దండయాత్ర" అంటూ సీట్లో సర్దుకుని కూర్చున్నాడు బాసు.

నేను వెనకగా నిలుచున్న బక్కపాటి చిన్న పర్సనాలిటీతో ఉన్న రమణమూర్తిని జబ్బ పట్టుకుని ముందుకి లాగి నా బ్యాగ్‌లో ఉన్న తెల్లటి కవర్ తీసి బాసు కేసి చూస్తూ "సార్, ఈ కవర్ రమణమూర్తి గారికి ఇవ్వండి" అంటూ ఆయన చేతికి ఇచ్చా.

అయోమయంతో కవర్ అందుకుని నా వైపు చూస్తూ రమణమూర్తికి ఇచ్చాడు బాసు.

రమణమూర్తిని చూస్తూ "కవర్ విప్పి చూడండి" అన్నాను.

బెరుకుగా రమణమూర్తి కవర్ విప్పి లోపలి లెటర్‌నీ తీసి నా వైపు చూశాడు.

"చదవండి సార్.. అందరూ వింటారు" అన్నా.

రమణమూర్తికి ప్రమోషన్ అని వినగానే బాసు ముఖాన నెత్తురు చుక్క లేదు. "కింద వరకు చదవండి" అన్నాను "ట్రాన్స్‌ఫర్ టు వరంగల్" అనేసరికి రమణమూర్తి మొహంలో ఆనందాన్ని చూశాను.

మొత్తానికి రమణమూర్తికి న్యాయం జరిగింది అనుకున్నాను. నా బ్యాగ్ నుంచి హైదరాబాద్ నుండి తెచ్చిన బొకే బాసు చేత రమణమూర్తికి ఇప్పించి కంగ్రాట్స్ కూడా చెప్పించి–

"ఒకే. ఇంకా మనం అందరం మన పనుల్లోకి వెళ్లిపోదాం!" అంటూ అందరూ ఛాంబర్ బయటకు దారి తీశాం.

ఆఖరిగా మిగిలిన నన్ను చూస్తూ బాసు లింగం గారు" ఇదెలా సాధ్యం విష్ణూ!" అన్నాడు, అప్పుడే కొంచం తేరుకుని.

స్వింగ్ డోర్ తీసుకుని ఒక కాలు బయటకు పెట్టిన నేను వెనక్కి బాసు వైపు చూస్తూ 'విష్ణు మాయ' అంటూ పైకి చూస్తూ దణ్ణం పెట్టుకున్నాను.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# ప్రకృతి వరం పర్యావరణం

**ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దాని వెనుక ఒక ముఖ్యమైన చరిత్ర ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ దేశాలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకురావడమే దీని ప్రధాన ఉద్దేశం.**



### ఆవిర్భావం

1972వ సంవత్సరంలో స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి మొదటిసారిగా ఒక భారీ సదస్సు నిర్వహించింది. దీనిని 'స్టాకోహోమ్ కాన్ఫరెన్స్' అని పిలుస్తారు. జూన్ 5 నుండి 16 వరకు జరిగిన ఈ సదస్సులో మానవ పర్యావరణం, అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సదస్సు జరిగిన మొదటి రోజైన జూన్ 5ని 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ నిర్ణయించింది. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ కోసం యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ అనే సంస్థను కూడా స్థాపించారు.

### మొదటి వేడుక

నిర్ణయం 1972లో తీసుకున్నప్పటికీ, మొదటి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మాత్రం 1973లో జరుపుకున్నారు. అప్పటి వేడుకల థీమ్ 'ఒకే ఒక భూమి' (ఓన్లీ ఒన్ ఎర్త్). ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు చాలా ఉన్నాయి. గ్లోబల్ వార్మింగ్, సముద్ర కాలుష్యం, జంతువుల అక్రమ రవాణా వంటి సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావడం, పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రభుత్వాల భాగస్వామ్యంతో రాజకీయ నిర్ణయాలు తీసుకునేలా దేశాలను ప్రోత్సహించడం, పర్యావరణాన్ని కాపాడటం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేయడం ఇత్యాదివి. ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన థీమ్‌తో పాటు ఒక అతిథ్య దేశం కూడా ఉంటుంది. ఉదాహరణకు 2018లో భారతదేశం ఈ వేడుకలకు ఆతిథ్యం ఇచ్చింది. అప్పటి థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికడదాం. మనం పీల్చే గాలి, తినే ఆహారం, తాగే నీరు అన్నీ ఈ ప్రకృతి నుండే వస్తున్నాయి. అందుకే ఈ భూమిని కాపాడుకోవడం మన కనీస ధర్మం'.

2005, జూన్ 5న శాన్‌ఫ్రాన్సిస్కోలో అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో గ్రీన్ సిటీస్, 'ప్లాన్ ఫర్ ది ప్లానెట్' అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. 2006లో అల్జీరియా దేశంలో 'డోంట్ డెజర్ట్ డ్రైల్యాండ్స్' అనే నినాదంతోనూ, 2007లో నార్వేలో 'మెల్టింగ్ ఐస్ ఎ హాట్ టాపిక్' అనే నినాదంతోనూ, 2008లో న్యూజిలాండ్‌లో 'కార్బన్ డై ఆక్సైడ్, కిక్ ద హేబిట్ టువర్డ్స్ ఎలా కార్బన్ ఎకానమీ' అనే నినాదంతోనూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ సమావేశాలను నిర్వహించారు. 2025లో ముఖ్యంగా 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు తట్టుకోవడం' పై దృష్టి పెడుతూ, పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడంపై ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది.

### అంతా కాలుష్యమయం


ఇదిలా ఉంటే నేడు మానవుడు తన మేధో సంపత్తితో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ప్రపంచవ్యాప్తంగా పలు పరిశ్రమలను నెలకొల్పుతున్నాడు. ఈ పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో కోలుకోలేనంతగా వాతావరణం కలుషితమై, పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం అన్నీ కలుషితమవుతున్నాయి. మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి ప్రసాదించిన వనరులను అవసరానికి మించి వాడుకుంటున్నాడు. అంతేగాకుండా ప్రపంచ మానవులు తన వేగవంతమైన జీవితంలో వాహన వేగం పెంచుతూ, ఇంధన కొరతకు కారణమవుతున్నారు. కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి పెరగడం వల్ల క్రమంగా భూమండలం వేడెక్కుతోంది. అడవులు, జలవనరులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ రకంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణమవుతోంది. ప్రకృతి మనిషికి ఇచ్చిన అద్భుతమైన వరం గాలి, నీరు, ఆహారం, నివాసం, ఇలా మనిషి మనుగడకు అవసరమైన ప్రతిదీ పర్యావరణం నుండే లభిస్తుంది. ఆధునిక మానవుడి స్వార్థం వల్ల నేడు పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది.

### పర్యావరణం ఎదుర్కొంటున్న సవాళ్లు

నేడు మనం చేస్తున్న అనేక పనుల వల్ల పర్యావరణ సమతుల్యతను దెబ్బతింటోంది. పెరిగిపోతున్న..

వాహనాలు, పరిశ్రమల వల్ల గాలి, నీరు, నేల అన్నీ కలుషితమైపోతున్నాయి. అడవుల నరికివేత, గ్రీన్ హౌస్ వాయువుల వల్ల భూమి వేడెక్కి రుతుపవనాలు గతి తప్పుతున్నాయి. భూమిలో కలిసిపోని ప్లాస్టిక్ వల్ల మూగజీవాలు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, భూసారం దెబ్బతింటోంది. భూమి వేడెక్కడం వల్ల వాతావరణంలో అసాధారణ మార్పులు వస్తాయి. ఎండల తీవ్రత పెరిగి వడగాల్పులు ప్రాణాంతకంగా మారతాయి. అదుపు లేని వర్షాలు, తుపాన్లు, వరదల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుంది. ధృవ ప్రాంతాల్లో మంచు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతాయి. దీనివల్ల సముద్ర తీర ప్రాంత నగరాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. కాలుష్యం పెరగడం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, గుండె జబ్బులు పెరుగుతాయి. నీటి కాలుష్యం వల్ల కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతాయి. అడవుల నరికివేత వల్ల అడవి జంతువులలో ఉండే వైరస్‌లు, వ్యాధులు మానవులకు సోకి, కరోనా వంటి కొత్త మహమ్మారులు వచ్చే అవకాశం ఉంది.

భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల తాగడానికి కూడా నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. నేల సారం తగ్గిపోవడం, సమయానికి వర్షాలు కురవకపోవడం వల్ల పంటలు పండవు. ఇది తీవ్రమైన ఆహార కొరతకు (కరువుదు) దారి తీస్తుంది. అడవులను నాశనం చేయడం వల్ల వేలాది జంతువులు, పక్షులు, కీటకాలు అంతరించిపోతాయి. ఉదాహరణకు తేనెటీగలు అంతరించిపోతే పరాగ సంపర్కం జరగక ఆహార ఉత్పత్తి ఆగిపోతుంది.



పర్యావరణ విధ్వంసం వల్ల కలిగే నష్టాలను పూడ్చుకోవడానికి దేశాలు భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. వరదలు, కరువులు సంభవించినప్పుడు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి వేల కోట్లు ఖర్చవుతాయి. ఇది ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తుంది. పకృతి లేకపోతే మనిషి లేదు. మనం పర్యావరణాన్ని నాశనం చేస్తే, మన రాబోయే తరాలకు మనం ఇచ్చేది కేవలం మురికి గాలి, కలుషిత నీరు, నివాస యోగ్యం కాని భూమిని మాత్రమే.

## పరిష్కార మార్గాలు

పర్యావరణాన్ని రక్షించడం అంటే భూమిని కాపాడటం మాత్రమే కాదు, మన భవిష్యత్తును కాపాడుకోవడం. ఇందుకోసం మనం చిన్న చిన్న మార్పులు చేయాలి. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలి. పెరటి తోటలు, మిద్దె తోటలను పెంచాలి. అడవుల విస్తీర్ణం పెరిగితేనే వర్షాలు సకాలంలో కురుస్తాయి. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. దానికి బదులుగా వస్త్రం, గోగు సంచులు, కాగితపు సంచులను వాడాలి. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేలా చేయాలి. ఇందుకోసం ప్రతీ గృహంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. నీటిని, విద్యుత్తు వృథా చేయకూడదు. ప్రకృతి మన అవసరాలను తీరుస్తుంది. కానీ దురాశను కాదు. కాబట్టి ప్రకృతి వనరులను నాశనం చేసుకుంటే, ముందు ముందు జీవకోటికి మనుగడ లేకుండా పోతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలి. దీనికి పర్యావరణ పరిరక్షణ ఒక్కటే నివారణ మార్గమని ఐక్యరాజ్యసమితి కూడా నినదిస్తోంది. అందులో భాగమే ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పాటించటం.

ప్రపంచవ్యాప్తంగా ఓ సమస్యగా పరిణమించిన వాతావరణ కాలుష్యాన్ని నివారించే క్రమంలో మానవులంతా బాధ్యతాయుతమైన పాత్రను పోషించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి ఒక్కరూ మూడు సూత్రాలను పాటించాలి. అనవసరమైన వస్తువుల కొనుగోలును తగ్గించడం, పాత వస్తువులను పారేయకుండా ఇతర పనులకు ఉపయోగించడం, కాగితం, గాజు, లోహాలను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడం.. ఇత్యాది పనులు చేస్తే పర్యావరణానికి కొంత మేలు చేసినవారమౌతాం. ప్రతి చిన్న పనికీ ఇంధన వాహనాలపై ఆధార పడకుండా నడవడం, సైకిల్ వాడటం మంచిది. ఇది ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. వీలైనంత వరకు బస్సు, రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను వాడటం వల్ల వాహన కాలుష్యం తగ్గుతుంది. మనం ప్రకృతి నుండి ఎంత తీసుకుంటున్నామో, అంతే తిరిగి ఇవ్వడం మన బాధ్యత. విద్యుత్ ఆదా చేయండి. సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించం వల్ల పర్యావరణానికి మరింత మేలు చేకూరుతుంది. పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత. 'మన భూమి మన చేతుల్లోనే ఉంది.

దాన్ని రక్షిస్తేనే మన భవిష్యత్తు సురక్షితం' అని అందరూ గ్రహించాలి. పర్యావరణ పరిరక్షణ అనేది నిరంతర ప్రక్రియ. చిన్న చిన్న మార్పులే భూమికి పెద్ద రక్షణగా మారతాయి. 'ఒకే ఒక భూమి' దానిని కాపాడుకుందాం, పచ్చని భవిష్యత్తుకు బాటలు వేద్దాం. మన పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి స్వచ్ఛమైన గాలి, తాగడానికి శుభ్రమైన నీరు. పర్యావరణాన్ని కాపాడటం అనేది ఒకరోజు వేడుకగా కాకుండా, మన జీవనశైలిలో భాగం కావాలి.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



# 'తటాక వేధ' అంటే ఏమిటి?

**సి.ఎస్. శర్మ, హైదరాబాద్**

**ప్రశ్న: తటాక వేధ అంటే ఏమిటి? దానివల్ల ఎలాంటి ఫలితాలు ఉంటాయి? వివరంగా తెలుపగలరు.**

**జవాబు:** చెఱువు, సరస్సు లేదా సరోవరం.. ఇవన్నీ కూడా తటాకానికి పర్యాయ పదాలు. వైశాల్యాన్ని బట్టి, నీటి నిలువల సారూప్యాలను బట్టి వివిధ పేర్లున్నాయి. ఇవన్నీ నీటిని తటస్థంగా నిలువ చేసుకుంటాయి.

బావి కూడా నీటిని నిలువ చేస్తుంది. అయితే చెఱువుకీ బావికి తేడా ఉంది. బావిలోనికి నీరు భూగర్భం నుండి ఊటల ద్వారా చేరుతుంది.

నీటిమట్టం భూమట్టం కంటే చాలా కిందికి ఉంటుంది. కాలువల ద్వారా వచ్చిన నీటితో చెఱువు నిండుతుంది. చెఱువు(తటాకం)లో నీరు దాదాపు భూమట్టం వరకు నిండుకుని ఉంటుంది. వాస్తు నియమానుసారం గృహానికి గానీ, గృహావరణమునకు గానీ, ఆగ్నేయంలో, దక్షిణంలో, నైరుతిన, పడమరన, పడమర వాయువ్యమున గోతులు, నీటి నిలువలు, నీటి ప్రవాహాలు ఉండకూడదు.

ఇలా ఉండకూడని దిక్కున నీటి నిలువలు కలిగిన గోతులు (బావులు, చెఱువులు, గుంతలు, వాగులు మొదలైనవి) ఉన్నట్లయితే 'తటాక వేధ' అనే వాస్తుదోషం కలుగుతుంది.

గృహాలకు అతి సమీపంలోగానీ, ఆనుకొనిగానీ ఈ విధమైన గోతులు, చెఱువులు ఉన్నప్పుడు మాత్రమే ఈ దోషం కలుగుతుంది.



ఒక ఊరికి ఆనుకొని పశ్చిమ, దక్షిణ దిశల్లో తటాకాలు ఉన్నప్పుడు, మంచి ఫలితాలు పొందటం కష్టమవుతుంది. తటాకాలకు ఉండవలసినంత ఎక్కువ దూరంలో వెలసిన ఊర్లకు ఈ దోషం ఉండదు.

పశ్చిమ, దక్షిణ దిక్కుల్లో ఉన్న కొండల ప్రదేశంలో ఏర్పడిన జలాశయాల వలన కూడా ఊళ్లకు, ఇండ్లకు ఈ దోషం ఉండదు.

## ఏ దిక్కు స్థలం కలిసొస్తుంది?

**సి.కె, విజయవాడ**

**ప్రశ్న: మీరు పాఠకులకు ఇచ్చే వాస్తు వివరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను విజయవాడలో ఒక స్థలం కొనాలని ప్రయత్నిస్తున్నాను. నాకు ఏ దిక్కు స్థలం కలిసొస్తుందో తెలుపగలరు.**

**జవాబు:** మీకు వ్యవహారనామ రీత్యా ఉత్తర లేదా ఉత్తర ఈశాన్య ముఖద్వారం బాగా కలిసొస్తుంది.

## పరిష్కార మార్గం?

**కె.ప్రమోద్, భద్రాచలం**

**ప్రశ్న: మాది ఉత్తరం ముఖం ఇల్లు. ప్రధాన ద్వారానికి ఎదురుగా పడమరకు మెట్లు ఉన్నాయి. అలా ఉండవచ్చా. మారే వేరే మార్గం లేదు. దానికి పరిష్కారం చెప్పగలరు.**

**జవాబు:** ప్రత్యామ్నాయాలకు, ఎలాంటి మార్పులకు వీలు లేనప్పుడు నిరంతరం చెడు ఫలితాలు పొందుతూ ఉంటే విసర్జించటమే (అమ్మేయటమే) పరిష్కారంగా స్వీకరించటం మంచిది. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ...............
చిరునామా:.................................................

– ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపుచెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది. – తులసీదాస్

– మహాత్ముల జీవితాలు గుమ్మడి పాదుల వంటివి. అవి పుట్టిన స్థలం నుండి చాలా దూరం పాకి అక్కడ కాయలనిస్తాయి. – శ్రీ మళయాళస్వామి




**వ్యక్తిగత లేదా సైద్ధాంతిక పర ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సమకాలీన రాజకీయాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కేవలం దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా ఒక దిగ్గజ నాయకునిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. మొత్తంగా వారం రోజుల పాటు ఇరవై నాలుగు ప్రజాస్వామ్య దేశాల్లో చేసిన ఈ సర్వేలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నంబర్ వన్ స్థానంలో నిలిచారు.**

# దేశభక్తిలో సామాజికత

## 'మోడీతత్వం'

2026 మార్చి నాటికి, అమెరికన్ డేటా ఇంటెలిజెన్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' వారం రోజుల పాటు 24 ప్రజాస్వామ్య దేశాల్లో చేసిన సర్వేలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా (వరల్డ్స్ మోస్ట్ పాపులర్ లీడర్) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

వరుసగా మూడోసారి భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా, మోదీ 68 శాతం ఆమోద రేటింగ్ (అప్రూవల్ రేటింగ్)తో గ్లోబల్ లీడర్ల జాబితాలో నంబర్ వన్‌గా నిలిచారు. మార్చి 2026 నాటికి, సర్వేలో పాల్గొన్న వారిలో 68 శాతం మంది ఆయన నాయకత్వాన్ని సమర్థించగా, కేవలం 26 శాతం మంది మాత్రమే వ్యతిరేకించారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నాయకులను అధిగమించి, ఈ ఆమోద రేటింగ్‌తో ఆయన అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. 2026 ప్రారంభంలో, ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్ల (10 కోట్ల) ఫాలోవర్లను దాటిన మొదటి ప్రపంచ నాయకుడిగా కూడా ఆయన రికార్డు సృష్టించడం గమనార్హం.

### ఎందుకింత ఆదరణ?

నరేంద్ర మోడీకి ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా విదేశీ నేతలు, ప్రజల నుండి అపారమైన ఆదరణ, గౌరవం లభించడానికి ప్రధాన కారణం ఆయన నాయకత్వ శైలి, భారతదేశంలో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అనుసరించే విదేశాంగ విధానం అని చెప్పవచ్చు. ప్రధానిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేశంలో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ ఇండియా, పారిశ్రామిక అభివృద్ధికి తీసుకున్న చర్యలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. ఆయన కేవలం భారత్‌లోనే కాకుండా, ప్రపంచ వేదికలపై బలమైన, నిర్ణయాత్మక నాయకుడిగా గుర్తింపు పొందారు. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నరేంద్ర మోడీ వివిధ దేశాల నుండి 14 కంటే ఎక్కువ అత్యున్నత జాతీయ పౌర పురస్కారాలను, అనేక అంతర్జాతీయ గౌరవాలను అందుకోవడం ఆయన పాపులారిటీకి నిదర్శనం. ప్రపంచంలోని వివిధ దేశాలతో సంబంధాలను మెరుగుపరచడం, ముఖ్యంగా గల్ఫ్ దేశాలు, అమెరికా, ఇతర దేశాలతో దౌత్యపరమైన బంధాలను బలోపేతం చేయడం, 'మన్ కీ బాత్' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం వంటివి ఆయనను ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఒక సాధారణ 'చాయ్ వాలా'గా అట్టడుగు స్థాయి నుండి ఎదిగిన ఆయనకు సగటు భారతీయుల జీవన ప్రమాణాల గురించి, వారి సమస్యల గురించి సంపూర్ణ అవగాహన ఉండడంతో ఆయన జన్ ధన్ యోజన, ముద్రా యోజన, బేటీ బచావో, బేటీ పఢావో, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్ యోజన, కిసాన్



సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా సామాజిక ఆర్థిక వెనుకబడిన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. దాదాపు 2020 నుండి 68-75 శాతం అప్రూవల్ రేటింగ్‌తో నిరంతరాయంగా అత్యధిక ప్రజాదరణ పొందిన ప్రపంచ నాయకునిగా మొదటి స్థానంలో కొనసాగుతున్న క్రేజ్ వల్ల ఆయన ఏ

దేశానికి వెళ్ళినా అక్కడ ప్రజలు, నాయకులు ఆయనను ఎంతో ఆత్మీయంగా ఆహ్వానిస్తారు.

## పాఠ్యాంశంగా 'మోడీ తత్వం'

భారత ప్రధాని నరేంద్ర మోడీకి గల ప్రపంచవ్యాప్త ప్రజాదరణను పరిగణనలోకి తీసుకుని, గుజరాత్‌లోని వడోదరాలో ఉన్న ప్రతిష్ఠాత్మక మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయం (ఎంఎస్‌యూ), సోషియాలజీ (సామాజిక శాస్త్రం) సిలబస్‌లో ఆయన నాయకత్వ శైలి, పాలనా విధానాలపై ఒక ప్రత్యేక పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టింది. ఈ కొత్త మాడ్యూల్‌కు 'మోడీ తత్వం' (Modi Tattva) అని పేరు పెట్టారు. దీని ప్రధాన ఉద్దేశం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ఒక భావనగా అధ్యయనం చేయడం, దేశీయ జ్ఞాన వ్యవస్థలు, హిందూ మతం, జాతీయవాదాన్ని అధ్యయనం చేయడాన్ని మూడు ప్రధాన కోర్సులలో ఏకీకృతం చేసే ఒక కొత్త పాఠ్యప్రణాళికగా చేర్చారు. ఇది 'సోషియాలజీ ఆఫ్ పేట్రియాటిజం' (దేశభక్తిలోని సామాజికత) అనే పేపర్‌లో భాగంగా ఉంటుంది. దీనిని బిఎ, ఎంఎ సోషియాలజీ



ప్రోగ్రామ్‌లలో బోధిస్తారు. ఈ పాఠ్యాంశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వ శైలి, పాలనా విధానాలు, ప్రజా సంబంధాలు, ఎన్నికల ప్రదర్శనలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. అంతేకాదు, ఈ కోర్సులో మోడీతో పాటు, ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) చరిత్ర, సిద్ధాంతాలు, ఛత్రపతి శివాజీ, సాయాజీరావు గైక్వాడ్ 3 వంటి చారిత్రక ప్రముఖుల కృషిని కూడా విద్యార్థులు అధ్యయనం చేస్తారు. సోషియాలజీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా నాయకత్వం, నిర్ణయం తీసుకోవడం, పాలనపై దాని ప్రభావాన్ని విశ్లేషించడం ఈ కోర్సు ముఖ్య ఉద్దేశం.

ఇవి ఇప్పుడు బీఏ సోషియాలజీ కోర్సు నాలుగవ సంవత్సరంలోని 10 పేపర్లలో, అలాగే రెండేళ్ల మాస్టర్స్ ఇన్ సోషియాలజీ ప్రోగ్రామ్ మొదటి సంవత్సరంలో భాగంగా ఉంటాయి. 'సోషియాలజీ ఆఫ్ భారత్', 'హిందూ సోషియాలజీ', 'సోషియాలజీ ఆఫ్ పేట్రియాటిజం' అనే ఈ మాడ్యూల్స్, ఒక్కొక్కటి నాలుగు క్రెడిట్ల కోర్సులు. జూన్‌లో ప్రారంభమయ్యే 2026-27 విద్యా సంవత్సరం నుండి ఎంఎస్‌యూలో సోషియాలజీ విద్య పునర్నిర్మాణంలో భాగంగా ఇవి రూపొందించారు. ఎంఎస్‌యూ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్‌పర్సన్‌గా, ప్రజా విధానాలను పర్యవేక్షించే నీతి ఆయోగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా, జిల్లా పరిపాలన 'వడోదర 2047' ప్రణాళికలో సభ్యుడిగా ఉన్న ఈ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ వీరేంద్ర సింగ్ దీనికి రూపకల్పన చేసారు. ఈ విధానం ద్వారా గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వర్తమాన కాలానికి అనుసరణీయమైన పాలనా ఆచరణ ఆధారిత, పరిశోధన ప్రేరిత సామాజిక శాస్త్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా ఆయన తెలిపారు. 'సోషియాలజీ ఆఫ్ పేట్రియాటిజం' కోర్సులో భాగమైన 'మోదీ తత్వం' అనేది, జర్మన్ సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ 'ఆకర్షణీయమైన అధికారం' అనే భావన నుండి స్ఫూర్తి పొంది, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై చేసే ఒక అధ్యయనమని సింగ్ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు తెలిపారు. మోడీ తత్వం కోర్సు, ప్రపంచ యవనికపై సమకాలీన రాజకీయ నాయకుడైన ప్రధాని నరేంద్ర మోడీని, సామాజిక శాస్త్ర చట్రంలో ఆకర్షణీయమైన నాయకత్వం, విధానాలపై అవగాహన, ప్రజలతో అనుసంధానం వంటి అంశాలలో ఒక కేస్ స్టడీగా పరిగణిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ చర్చలలో ప్రధాని మోడీ ఒక అనివార్యమైన వ్యక్తిగా రూపాంతరం చెందారు. ఎప్పుడో ఐదు దశాబ్దాల తర్వాత 'ఆదరణ పొందిన నేతల' విలక్షణత, నాయకత్వ విలువలు, శైలిల విషయమై చర్చించే బదులు, ప్రస్తుత తరం దానిని అధ్యయనం చేసేలా చేయడమే తమ లక్ష్యంగా ఈ పాఠ్యాంశాన్ని తీర్చిదిద్దారు. గుజరాత్‌లోని మారుమూల గ్రామాలలో విద్యార్థులు యధాలాపంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించిన క్షేత్రస్థాయి కార్యకలాపాలను చూసినప్పుడు, ఈ కోర్సులో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్‌ను కూడా పరిశీలించాలనే ఆలోచన వచ్చినట్లు సింగ్ తెలిపారు.

## మహారాజా సాయాజీరావు గైక్వాడ్

1875 నుండి 1939 వరకు బరోడా మహారాజుగా కొనసాగిన సయాజీరావు గైక్వాడ్ బాలికలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు ఆడపిల్లలను పాఠశాలకు పంపని కుటుంబాలపై విధించిన జరిమానాను సైతం ఉదహరించారు. మహారాజా సయాజీరావు సామాజిక సంస్కరణల నమూనా, సమ్మిళిత విధాన రూపకల్పన, నైతిక నాయకత్వం ఒక వారసత్వాన్ని మిగిల్చాయని అది ఈనాటికీ ఈ విశ్వవిద్యాలయంలో సజీవంగా ఉంది అని సింగ్ అభిప్రాయపడ్డారు.

ఆడపిల్లలను పాఠశాలకు పంపని కుటుంబాలపై విధించే జరిమానాను తాను 'సానుకూల పన్ను'గా భావిస్తానని, ఈ మాడ్యూల్‌లో విద్యార్థులు సర్దార్ పటేల్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సహా మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ బాహ్య శక్తులతో పోరాడటానికి మేవార్ పాలకులను ఏకం చేయాలనే ఆయన దార్శనికత గురించి కూడా అధ్యయనం చేసినట్లు వివరించారు.

– యేచన్ చంద్రశేఖర్

# వైవిధ్యమైన కవితలు

"కాదేదీ కవితకనర్హమ్" అన్నట్టు సబ్బుబిళ్ళ, గొడుగు, తువ్వాలు, కాగితం సంచీ.. వంటి ఇతివృత్తాలపై సృజనాత్మకంగా కవితాత్మను కదిలించటం డా॥ రాజేశ్వరి దివాకర్ల వంటి పరిణత కవయిత్రులే ప్రతిభావంతంగా సాధించగలుగుతారు. ఈ వచన కవితా సంపుటిలో 43 కవితలున్నాయి. హృదయాన్ని ఆర్ద్రంగా స్పృశించి, అనుభూతి రగిలించటం కవయిత్రికే చెల్లింది. స్నానాల గదిగూట్లో సబ్బుబిళ్ళ, గోడ మీద ఫొటో, ఉదయాస్తమయాల తువ్వాలు, కరసేవల బంటు పోస్ట్ ఉమెన్, పచ్చని ఊపిరి శ్వాసల మర్మాలను తెలిపే కాగితం సంచీ, మబ్బు పట్టిన వానకు దబ్బున రెక్కలిప్పుకునే గొడుగు ప్రతీ కవిత, చిత్రాలుగా చదువరుల కళ్ళముందు కదలాడతాయి. 'శయన గాయం' ఇంత కాలం తోడుగా ఉన్న మనిషి చిత్రపటమైపోయినప్పుడు వేదన ధ్వనిస్తుంది. ఇతివృత్తాల వైవిధ్యంతో పాటు గాఢమైన కవితాత్మకంగా సరికొత్త భావ వ్యక్తీకరణ పలకరింపచేయటం ఈ కవితల ప్రత్యేక సార్థకత.



లాంతరు వెలుగులో చీకటి వేళల కిటికీ ఊచల నీడలు, వెనుక బెంచీ అమ్మాయి ఈ సంపుటిలో ఎన్నో సజీవ కవితా కథన చిత్రాలు. ఒక్క 'ఒంటి స్తంభం మేడ' చాలు. డా॥ రాజేశ్వరి హృదయాన్ని కదిలించగల నేర్పు, ఆపేక్ష, అభిజ్ఞత గల కవయిత్రి అని తెలియజేయడానికి.

**(కాగితం సంచీ-రచన: డా॥ రాజేశ్వరి దివాకర్ల; వెల: రూ.150/-లు; ప్రతులకు: రాజేశ్వరి దివాకర్ల, కేరాఫ్ శైలి గ్రాఫిక్స్, 5-126/51, వెంకటాద్రి నగర్, గోవిందపల్లి, జగిత్యాల-505 327 తెలంగాణ)**


పుస్తక సమీక్ష



# జీవన సందేశం అందించే నవల

రక్త సంబంధంతో, స్నేహ బాంధవ్యంతో, వైవాహిక బంధాలతో సహజంగా జీవితం నడుస్తుంది. ఆత్మీయత, నిస్వార్థ, మానవతా హృదయంతో, కష్టాలలో ఉన్నవారు ఎవరైనా వారిని ఆదుకోవటం అండగా నిలబడటం సత్సందేశం. బంధాలు-అనుబంధాలు నవలా రచయిత్రి సుజల గంటి, 'అశ్విని' పాత్ర ఒక గృహిణిగా ఎదుర్కొన్న పరిస్థితులను చిత్రీకరిస్తూ నవల ప్రారంభం నుంచి చదువరులను చలింపచేయడం, నవలాంతానికి ఆమె యిచ్చిన రిలీఫ్, ఆ కుటుంబం తీరం చేరిన తీరుతెన్నులు, అద్భుత జీవన సందేశాన్ని అందించాయి. రచయిత్రి సృష్టించిన 'నిషా' వంటి వారు అరుదైతే, ఆమెను నిర్లక్ష్యం చేసిన రక్తసంబంధీకులు ప్రస్తుత సమాజంలో అసంఖ్యాకంగా కనపడుతుంటారు. 'మనకెందుకులే', 'తనకుమాలిన ధర్మం' వంటి ప్రవృత్తి వుండనే వుంది. కరోనా రోజులలో మృత్యుభీతి మనం చవిచూసాం. ఈ నవలలో రచయిత్రి సుజల, తోడబుట్టువులంటే జీవితాంతం తోడు ఉండాలని, కష్టాలలో కన్నీళ్ల ఆపదలలో కూడా ఆదుకోకుండా స్వార్థంతో వ్యవహరించే కుసంస్కారులకు చెంపపెట్టు పెట్టారు. మనుషుల ఆత్మీయతా ప్రేమానురాగాలను తుడిచిపెట్టే స్వార్థశక్తుల నుండి సంకల్ప బలంతో, జీవితం సుఖాంతం చేసుకొన్న కథనాన్ని ప్రతిభావంతంగా తీర్చిదిద్దారు.

**(బంధాలు-అనుబంధాలు; రచన: సుజల గంటి; వెల: రూ.200/-లు; ప్రతులకు: సుజల గంటి, ఫ్లాట్ నం.303, అలేఖ్య రెయిన్ డ్రాప్స్, గౌతమీ ఎన్‌క్లేవ్, కొండాపూర్, హైదరాబాద్-500 084)**



# శూన్యం నుంచి విస్ఫోటనం వైపు..

"ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనపడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తుంటే స్ఫటిక నిర్మాణం గురించి ఆలోచనలు వస్తుంటాయి. అందుకే విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం" అంటారు ఫిజిక్స్ అరుణ్‌కుమార్. శూన్యంలో కాంతివేగంతో పయనిస్తూనే 'బిగ్ బ్యాంగ్'గా వ్యాససంపుటితో మన ముందుకు వచ్చిన ఈ భౌతిక శాస్త్ర ప్రేమికుడు, అనంత విశ్వంలోని శూన్యం ద్వారా కాంతి సంవత్సరాల అన్వేషణా యానంలో బిగ్ బ్యాంగ్ అరుణోదయం దర్శింపచేస్తున్నాడు. 47 వ్యాసాల ఈ సంపుటిలో శ్రీనివాస రామానుజన్, సి.వి.రామన్, అబ్దుల్ కలాం, సునీతా విలియమ్స్, విక్రమ్ సారాభాయ్, ఆర్యభట్ట, ఐన్‌స్టీన్, సత్యేంద్రనాథ్‌బోస్‌లను సాక్షాత్కరింపచేసారు. వివిధ దిన పత్రికలలో ప్రచురింపబడిన వైవిధ్యభరిత ఇతివృత్తాల వ్యాసాలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి.

ఈ బిగ్ బ్యాంగ్ ఆలోచనా తరంగాలలో చదువుల తల్లిగా, ప్రత్యేక రాష్ట్ర సాకారంగా, మిషన్ ఎడ్యుకేషన్, రాజకీయ ముఖ చిత్రంగా తెలంగాణా, శ్రీశ్రీ, కాళోజీ, రేవంత్, కేసీఆర్, వినేశ్, అతిశీ, రాహుల్, రాజమౌళి, ఏచూరి.. ఇలా ఎందరో ప్రముఖులను గురించి ఫిజిక్స్ అరుణ్‌కుమార్ సందర్భానుసారంగా రాసిన వ్యాసాలు ప్రచురింపచేసారు.

**(బిగ్ బ్యాంగ్-రచన: ఫిజిక్స్ అరుణ్‌కుమార్; వెల: రూ.220/-లు; ప్రతులకు: ఫిజిక్స్ అరుణ్‌కుమార్, సన్నాఫ్ సుబ్బయ్య, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు జిల్లా, తెలంగాణ-509 209)**

- జయసూర్య

# 31 మే, 2026 నుండి 6 జూన్, 2026 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం శుభకార్య యత్నాలు నిదానంగా సాగుతాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సాంకేతిక కారణాల వలన పనులు నత్తనడకన సాగుతాయి. స్త్రీలతో విభేదాలు ఏర్పడే సూచనలున్నాయి. మీ వలన సహాయం పొందికూడా పొందలేదని వాదించే వారు ఎదురవుతారు. మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తారు. వైద్యున్ని మార్పు చేస్తారు. నిత్యం కనకధారా స్తోత్రం పఠించడం, ఇంద్రాణి రూపు ధరించడం చెప్పదగినది.

### వృషభం

ఈ వారం గోప్యతకు ప్రాధాన్యతనిస్తారు. మీలోని సృజనాత్మకత గుర్తింప బడుతుంది. దైనందిన జీవింలో మార్పులు గోచరిస్తున్నాయి. ఆపేక్షల కన్నా ధనానికే ప్రాముఖ్యతనిస్తున్న వర్గం వలన మానసిక అప్రశాంతత చోటు చేసుకుంటుంది. వైద్యరంగం లోని వారికి అనుకూలంగా ఉంటుంది. లౌక్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఈ వారం మీకు మేలు చేకూరుతుంది. తమగొప్పలు చెప్పుకుంటూ విసిగించేవారు మీకు తారసపడతారు.

### మిథునం

ఈ వారం కుటుంబ సమస్యలు, బంధువులతో తగాదాలు తప్పక పోవచ్చు. ఆర్థికంగా కొంత ఒడిదు దుకులు ఉంటాయి. ఋణాలు కూడా అధికంగా చేస్తారు. సోదరులు, మిత్రుల నుండి అందిన లేఖ ద్వారా ఆసక్తికరమైన సమాచారాన్ని తెలుసుకుంటారు. అంతర్గత శత్రువులు పెరుగుతారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆరోగ్య విషయంలో కాస్త మెలకువగా ఉండడం మంచిది.

### కర్కాటకం

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటు చేసు కుంటాయి. నిత్యం అష్టగణపతిని పూజించండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీల సూచన. కళా,రాజకీయ రంగాల వారికి విదేశీ పర్యటనలు జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలను చేపట్టాలనుకుంటారు. క్రయవియాలలో స్వల్ప లాభాలు.

### సింహం

ఈ వారం దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆచితూచి అడుగు వేయటం మంచిది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. బంధువుల, మిత్రులతో ఏర్పడిన వివాదాలు తీరతాయి. విలువైన వస్తువులు, వస్త్రాలు, గృహం, స్థలాలు కొనుగోలు చేస్తారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం చేస్తారు. వాహన సౌఖ్యం.

### కన్య

ఈ వారం వ్యవహారాలలో స్తబ్దత చోటు చేసుకుంటుంది. మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. స్త్రీలతో విభేదాలు ఏర్పడనంత వరకు చెప్పుకోదగిన ఇబ్బందులేవీ చోటు చేసుకోవు. ఎదుటివారు చెప్పేది ఆసాంతం వినండి. తొందర పాటు మాటలు, పరుష సంభాషణలు తగాదాలు లాభించవు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండూ కలిసి రావు.

### తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. రాజకీయ, కళారంగాల వారికి సన్మానాలు, సత్కారాలు లభిస్తాయి. ఆరోగ్య విషయాలలో జాగ్రత్తలు పాటించండి. షేర్లు, క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. సన్నిహితులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు.

### వృశ్చికం

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు తగ్గ లాభాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది. కొత్త విషయాలు గ్రహిస్తారు. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం. బంధువుల నుండి అందిన సమాచారం సంతోషం కలిగిస్తుంది. వాహనాలు ఆరోగ్య విషయాల పట్ల నిర్లక్ష్యం వద్దు. ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు జాగ్రత్త వహించండి ఇది చెప్పదగిన సూచన.

### ధనస్సు

ఈ వారం వ్యాపారస్తులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకొనండి. అగ్రిమెంట్లు ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి. సినీ,కళా,సాహిత్య రంగాలలోని వారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా ఏర్పడుతున్న అవాంతరాలను పరిగణలోనికి తీసుకొనక పోవడం మంచిది.

### మకరం


ఈ వారం కుటుంబ ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. నిత్యం అరటినార వత్తులతో దీపారాధన చేయటం అన్ని విధాలా శ్రేయస్కరం. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు చేయటం మంచిది. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఉపకరిస్తాయి. సెంటిమెంట్ వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.

### కుంభం

ఈ వారం ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా వుంటాయి. ఏ పని చేపట్టినా, జాప్యం జరుగు తుంది. కోపతాపాలకు దూరంగా వుండడం మంచిది. అష్టగణపతి పీఠానికి ప్రతి రోజు సిద్ధగంధంతో పూజ చేయండి. తొందరపాటు నిర్ణయాలు వద్దు. భూముల క్రయవిక్రయాలు నిదానంగా సాగుతాయి. దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కీలక సమయంలో సన్నిహిత వర్గం నుండి ఆర్థిక సహాయాన్ని అందుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

### మీనం

ఈ వారం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు అందివస్తాయి. అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి. కార్యాలయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించి అధికారుల మన్ననలు అందుకుంటారు. పొదుపు పథకాలు అభివృద్ధి పథంలో ఉంటాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. నిత్యం నాగసింధూరం ధరించడం మేలు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి. పెండింగ్ వ్యవహారాలలో కూడా కొంత కదలిక ఏర్పడుతుంది.


ఆ లచ్చిమి నన్ను "హనీ ట్రాప్" చేసి నా
బొచ్చెలో ఉన్న అన్నం అంతా లాగేసుకుందిరా!!


..దయచేసి సాంప్రదాయాలు,
నైతిక విలువలు నేర్పిస్తారా మాస్టారూ..!!
మాస్టారు
Zakir...


దమ్మున్న ఛానెల్
BREAKING NEWS

# ఈ వారం కార్టూన్స్



పాము మెలికలు తిరిగినట్టున్న ఈ స్కైవాక్ బ్రిడ్స్ చైనాలోని చాంగ్‌కింగ్‌లో ఉంది. దీనిని ఎలింగ్ స్కై వాక్ బ్రిడ్జి అని అంటారు.













